

మాట్లాడుతున్న కలెక్టర్ నారాయణరెడ్డి

విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు

రంగారెడ్డి అర్బన్, జూలై 22 (ఆంధ్రజ్యోతి): విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని కలెక్టర్ నారాయణరెడ్డి హెచ్చరించారు. మంగళవారం కలెక్టరేట్‌లో వసతి గృహాల్లో మౌలిక సదుపాయాలు, గురుకుల పాఠశాలల సమస్యలు, ఇందిరమ్మ ఇండ్ల పురోగతి, వన మహోత్సవంపై సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యాలయాల్లో మెరుగైన వసతులు కల్పిస్తూ మెనూ ప్రకారం విద్యార్థులకు భోజనం అందించాలన్నారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాల్లో వేగం పెంచాలని, వన మహోత్సవంలో భాగంగా విరివిగా మొక్కలు నాటాలన్నారు. అనంతరం నిర్వహించిన టెలీ కాన్ఫరెన్స్‌లో ఈ నెల 25న లబ్ధిదారులకు రేషన్‌కార్డుల పంపిణీకి తగిన ఏర్పాట్లు చేయాలని జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారి సుజాత, డీపీవో సురేష్‌మోహన్‌కు ఆదేశించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్, డీఆర్వో సంగీత, హౌసింగ్ పీడీ హనుమంతు నాయక్, డీపీవో సురేష్ మోహన్, ఉద్యానవన శాఖ అధికారి సురేష్, వ్యవసాయ శాఖ అధికారి ఉష, డీఈవో సుశీందర్రావు, బీసీ సంక్షేమాధికారి కేశూరాం, అధికారులు రామారావు, రామావేశ్వరి. పద్మావతి పాల్గొన్నారు.



సోనుకు అవార్డు అందజేస్తున్న సినీ నటుడు భానుచందర్

కరాటే మాస్టర్ సోనుకు జాతీయ స్థాయి అవార్డు

ఆమనగల్లు, జూలై 22(ఆంధ్రజ్యోతి): ఆమనగల్లు పట్టణానికి చెందిన సోను కరాటే అకాడమీ వ్యవస్థాపకురాలు సోనుకు జాతీయ స్థాయి అవార్డు వరించింది. కరాటే పోటీల నిర్వాహణకు చేసిన కృషికి గుర్తింపుగా నేషనల్ స్టార్ ఎక్సలెన్స్ అవార్డుకు ఎంపిక చేశారు. ఏపీలోని విజయవాడ నగరంలో మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో ప్రముఖ సినీ నటుడు భానుచందర్ చేతుల మీదుగా సోను అవార్డు అందుకున్నారు. ఈ సందర్భంగా పలువురు సోనును అభినందించారు.

నేడు చేవెళ్లలో రేషన్ కార్డుల పంపిణీ



చేవెళ్ల, జూలై 22 (ఆంధ్రజ్యోతి): చేవెళ్ల పట్టణ కేంద్రంలో బుధవారం లబ్ధిదారులకు కొత్త రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమం ఉంటుందని తహసీల్దార్ కృష్ణయ్య మంగళవారం ప్రకటనలో పేర్కొన్నారు. చేవెళ్ల ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఉదయం 11 గంటలకు ఎమ్మెల్యే కాలె యాదయ్య లబ్ధిదారులకు కొత్త రేషన్‌కార్డులు అందజేస్తారని తెలిపారు. మండలంలో మొత్తం పది కొత్త రేషన్ కార్డులు వచ్చాయని, లబ్ధిదారులు సకాలంలో కార్యక్రమానికి హాజరు కావాలని కోరారు.

అగ్రిమెంట్ ఒకరిది.. వ్యాపారం మరొకరిదిగా మారింది ఎస్సీ సర్వీస్ కోఆపరేటివ్ డెవలప్‌మెంట్ సొసైటీ లిమిటెడ్ వాణిజ్య సముదాయాల పరిస్థితి. ఎస్సీలు ఆర్థికాభివృద్ధి సాధించాలనే సదుద్దేశంతో ప్రభుత్వం గతంలో జిల్లా వ్యాప్తంగా 250 గజాల స్థలంలో 21 షాంపింగ్ కాంప్లెక్స్‌లను నిర్మించింది. ఒక్కో షాపింగ్ కాంప్లెక్స్‌లో ఐదు దుకాణాల చొప్పున(షెట్టర్స్) మొత్తం 106 దుకాణాలను ఏర్పాటు చేశారు. అందులో మొదట్లో లబ్ధిదారులే వివిధ రకాల షాపులను ఏర్పాటు చేసుకుని ఆర్థికంగా ఎదిగారు. కాలక్రమేణ వారు షెట్టర్లను ఇతరులకు అద్దెకు ఇవ్వడం ప్రారంభించారు. తర్వాత ప్రతి నెలా అద్దె డబ్బులు వసూలు చేయాల్సిన అధికారులు పట్టించుకోకపోవడంతో ప్రభుత్వానికి రావాల్సిన అద్దె ఏళ్లుగా పెండింగ్ పడుతూ వస్తోంది.



షాబాద్‌లో వాణిజ్య సముదాయాలు

అద్దె ఆగం!

అగ్రిమెంట్ చేసుకొని మరొకరికి రెంట్

- రెట్టింపు వసూలు చేస్తున్న లబ్ధిదారులు
- దుకాణాలను పట్టించుకోని అధికారులు
- ఏళ్లుగా వసూలు కాని బాడుగ
- ప్రభుత్వ ఆదాయానికి గండి
- నిరుపయోగంగా పాల్ట్రీ షెడ్లు
- ఎస్సీ సర్వీస్ కోఆపరేటివ్ డెవలప్‌మెంట్ సొసైటీకి భారీగా నష్టం



దుకాణాలను పరిశీలిస్తున్న ఎస్సీ కార్పొరేషన్ అధికారులు

రంగారెడ్డి అర్బన్, జూలై 22 (ఆంధ్రజ్యోతి): రాజేంద్రనగర్, అత్తాపూర్, కిస్మత్‌పూర్, కాటేదాన్, గగన్‌పహాడ్, శంషాబాద్, మహేశ్వరం, తుక్కుగూడ, కందుకూర్, యాచారం, మంచాల, ఇబ్రహీంపట్నం, హయత్‌నగర్, రాగన్నగూడ, సాహెబ్‌నగర్, గుంటి జంగయ్యనగర్, నాగోల్, చేవెళ్ల, షాబాద్, శంకర్‌పల్లి, గచ్చిబౌలిలోని అంజయ్య నగరలోని షాపింగ్ కాంప్లెక్స్‌లో ఐదు చొప్పున షెట్టర్లను నిర్మించారు. అప్పట్లో ఒక్కో షెట్టర్‌కు రూ.500 అద్దె ఫిక్స్ చేశారు. ఆర్థికంగా వెనుకబడిన నిరుద్యోగ యువకులు స్వయం ఉపాధి పొందేందుకు ఈ షెట్టర్లను అద్దెకు ఇచ్చారు. అర్బన్ మండలాల్లో ఒక్కో షెట్టర్ రూ.20 నుంచి 30 వేలకు అద్దెకు ఇచ్చారు. రూరల్ మండలాల్లో రూ.15 వేల నుంచి రూ.20 వేల వరకు అద్దెకిచ్చారు. అయితే ఎస్సీ సర్వీస్ కోఆపరేటివ్ డెవలప్‌మెంట్ సొసైటీ లిమిటెడ్‌కు ప్రతీ నెల ఒక షెట్టర్‌కు కేవలం రూ.500 మాత్రమే చెల్లిస్తున్నారు. ఈ డబ్బులు కూడా ఏళ్ల తరబడి చెల్లించడం లేదనే విషయం తాజాగా జిల్లా ఎస్సీ కార్పొరేషన్ ఈడీ తనిఖీల్లో వెలుగు చూసింది.

అద్దెపై అద్దె వసూలు

కొత్తగా ఈడీగా బాధ్యతలు తీసుకున్న పద్మావతి జిల్లాలో సుడిగాలి పర్యటనలు చేస్తున్నారు. కేవలం రెండు నెలల్లోనే షెట్టర్ల అద్దె బకాయిలు రూ.10 లక్షల వరకు వసూలు చేశారు. నిజమైన లబ్ధిదారులు దుకాణాలను ఇతరులకు అద్దెకిచ్చి వేలల్లో సంపాదిస్తున్నారు. ప్రాంతాన్ని

మిగతా 8వ పేజీలో...

జిల్లాలో కాంప్లెక్స్‌ల వివరాలు

షాపింగ్ కాంప్లెక్స్‌లు	21
మొత్తం షాపులు	106
ఖాళీగా ఉన్నవి	25
పేరుకుపోయిన అద్దె	రూ.93,60,740
వసూలైనవి	రూ.57,47,793
వసూలు కావాల్సినవి	రూ.36,12,947

అద్దె బకాయిలు చెల్లించాల్సిందే..



ఎస్సీ సర్వీస్ కోఆపరేటివ్ డెవలప్‌మెంట్ సొసైటీ లిమిటెడ్ పరిధిలో జిల్లా వ్యాప్తంగా 106 షెట్టర్లు ఉన్నాయి. ఒక్కో దుకాణానికి రూ.500 అద్దె కాగా, లబ్ధిదారులు ఏళ్లుగా అద్దె చెల్లించడం లేదు. లబ్ధిదారులు ఇతరులకు రూ.15 వేలకు షాపులను అద్దెకిచ్చినట్లు తనిఖీల్లో తేలింది. కొన్నిచోట్ల షాపింగ్ కాంప్లెక్స్ శిథిలావస్థకు చేరాయి. అద్దె వసూలైన వెంటనే మరమ్మతులు చేపడుతాం. నిరుపయోగంగా ఉన్న పౌల్ట్రీ షెడ్లను అందుబాటులోకి తీసుకువస్తాం.

- పద్మావతి, ఈడీ, జిల్లా ఎస్సీ కార్పొరేషన్



అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే రంగారెడ్డి

బంగారు తెలంగాణ సాధనే లక్ష్యం

» ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి

యాచారం, జూలై 22(ఆంధ్రజ్యోతి): బంగారు తెలంగాణ సాధనే లక్ష్యమని ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని చిన్నతూండ్ల, చౌదర్‌పల్లి, మొండిగౌరెల్లి, గున్‌గల్ గ్రామాల్లో రూ.90 లక్షలతో చేపట్టిన అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. 50 మందికి కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులు పంపిణీ చేశారు. వన మహోత్సవంలో భాగంగా గున్‌గల్ రిజర్వ్ ఫారెస్టులో మొక్కలు నాటారు. అనంతరం మండల కేంద్రంలో నిర్వహించిన జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ ఇచ్చిన మాట ప్రకారం ఆరు గ్యారెంటీలను అమలు చేస్తున్నామని తెలిపారు. తాను గెలిచిన ఏడాదిలోపే నియోజకవర్గంలో 500 ఇందిరమ్మ ఇండ్లు కట్టిస్తున్నామని చెప్పారు. మండల పరిధితో కొత్తగా 3,500 రేషన్‌కార్డులు ఈ నెల 25న పంపిణీ చేయనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమాల్లో బీఎన్‌రెడ్డి ట్రస్ట్ ఛైర్మన్ బిలకంటి చంద్రశేఖర్‌రెడ్డి, మార్కెట్ కమిటీ ఛైర్మన్ కంబాలపల్లి గురునాథ్‌రెడ్డి, డైరెక్టర్లు మస్కు నర్సింహ, ఎండీ అక్బర్ పాల్గొన్నారు.

ఎమ్మెల్యే సార్.. ఆదుకోండి

మండలంలోని గున్‌గల్ గ్రామానికి చెందిన మచ్చ రాజు(35)కు పక్షవాతం కారణంగా కాళ్లూ, చేతులూ పడిపోయాయి. పింఛన్ ఇప్పించి ఆదుకోండని ఆ అభాగ్యుడు గున్‌గల్‌కు వచ్చిన ఎమ్మెల్యేను కలవడానికి రోడ్డుపైకి తన బంధువు సాయంతో వచ్చే లోపే ఎమ్మెల్యే వెళ్లిపోవడంతో రోదిస్తూ వెనక్కి వెళ్లిపోయాడు. ఇతడికి యాదయ్య అనే పదేళ్ల కుమారుడుండగా వీరిద్దరినీ రాజు తల్లి యాదమ్మ భిక్షాటన చేసి పోషిస్తోంది. దివ్యాంగుల పింఛన్ ఇప్పించి ఆదుకోవాలని రాజు వేడుకున్నాడు.



లాల్‌పహాడ్‌లో నీట మునిగిన పత్తి చేను

దంచికొట్టిన వాన

- తాండూరులో అత్యధికంగా 111.8 మి.మీ. వర్షపాతం నమోదు
- లోతట్టు ప్రాంతాలు జలమయం
- నీట మునిగిన పంట పొలాలు

రంగారెడ్డి అర్బన్/చౌదరిగూడ, జూలై 22(ఆంధ్రజ్యోతి): గడిచిన 24 గంటల్లో ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలోని పలు ప్రాంతాల్లో భారీ వర్షం కురిసింది. ఈ వర్షానికి లోతట్టు ప్రాంతాలన్నీ జలమయమయ్యాయి. పలు చోట్ల రోడ్లు దెబ్బతినగా మట్టి రోడ్లు బురదమయంగా మారాయి. భారీ వర్షానికి పొలాల్లోకి నీరు చేరింది. వాగులు, వంకలు పొంగిపొర్లాయి. చెక్ డ్యాంలు అలుగు పారుతున్నాయి. సోమవారం రాత్రి నుంచి మంగళవారం రాత్రి వరకు కురిసిన వర్షానికి వికారాబాద్ జిల్లా తాండూరులో అత్యధికంగా 111.8 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైంది. తర్వాత దౌల్తాబాద్ మండలంలో 106.8 మి.మీ., యాలాలలో 80.0 మి.మీ., మోమిన్‌పేటలో 22.0 మి.మీ., కుల్కచర్ల మండలం పుట్టపహాడ్‌లో 79.5 మి.మీ., పరిగిలో 64.0 మి.మీ., దోమలో 67.0 మి.మీ. వర్షపాతం నమోదైంది. రంగారెడ్డి జిల్లా రాజేంద్రనగర్ మండలం మైలార్‌దేవ్‌పల్లిలో అత్యధికంగా 65.3 మి.మీ. వర్షపాతం నమోదైంది.



తడిసిన రికార్డులను పక్కకు వేస్తున్న సిబ్బంది

తడిసిన రెవెన్యూ రికార్డులు

జిల్లేడ్ చౌదరిగూడలో కురిసిన భారీ వర్షానికి తహసీల్దార్ కార్యాలయంలోకి వర్షపు నీరు వచ్చి చేరింది. దీంతో పలు రికార్డులు తడిసిపోయాయి. మంగళవారం ఉదయం అధికారులు వచ్చి తడిసిన రికార్డులను పక్కకు తీసి ఆరబెట్టారు. వర్షానికి రికార్డు గదిలోకి నీరు చేరడంతో కిందున్న ఫైల్స్ కొంతమేర తడిసిపోయాయని తహసీల్దార్ జగదీశ్వర్ తెలిపారు.

మద్యం మత్తులో బాలికపై లైంగిక దాడికి యత్నం

» నిందితుడి అరెస్ట్

శంషాబాద్ రూరల్, జూలై 22 (ఆంధ్రజ్యోతి): తాగిన మత్తులో బాలికపై లైంగిక దాడికి యత్నించాడు ఓ యువకుడు. ఈ ఘటన రాజీవ్ గాంధీ ఇంటర్‌నేషనల్ ఎయిర్‌పోర్ట్(ఆర్జీఐఏ) పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. సీఐ బాల్‌రాజ్ తెలిపిన వివరాల ప్రకారం.. యూపీకి చెందిన వ్యక్తి స్థానిక మహిళను పెళ్లి చేసుకున్నాడు. వీరికి పదేళ్ల కూతురు ఉంది. వీరు శంషాబాద్‌లో భిక్షాటన చేస్తూ జీవనం సాగిస్తున్నారు. మంగళవారం తెల్లవారుజామున ఇంద్ర ఆస్పత్రికి ఎదురుగా ఉన్న ఫ్లైఓవర్ కింద నిద్రిస్తుండగా మద్యం మత్తులో ఉన్న గుజరాత్‌కు చెందిన సంజయ్ అలియాస్ ఇర్ఫాన్ హుస్సేన్(25) బాలికపై లైంగిక దాడికి యత్నించాడు. గమనించిన తల్లిదండ్రులు, స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. బాలికను వైద్య పరీక్షల నిమిత్తం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. నిందితుడిని సైతం వైద్య పరీక్షల నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. అతడిపై పోక్సో కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించి దర్యాప్తు చేస్తున్నారు. నిందితుడు బతుకుదెరువు కోసం కొద్ది రోజుల క్రితం శంషాబాద్‌కు వచ్చాడు. అడ్డమీద కూలి పనులకు వెళ్తున్నాడు. బాధితురాలి మానసిక స్థితి సరిగా లేదని తల్లిదండ్రులు చెప్పినట్లు పోలీసులు తెలిపారు.

ఏటా మహిళా సంఘాలకు

రూ.20వేల కోట్ల రుణాలు

కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేస్తాం.. వారిని పారిశ్రామికవేత్తలుగా చూడాలన్నదే లక్ష్యం

రూ.7వేల కోట్ల మిత్తీలు కడుతూనే సంక్షేమం.. ఐటీ శాఖ మంత్రి శ్రీధర్ బాబు

షాద్‌నగర్/చౌదరిగూడ జూలై 22(ఆంధ్రజ్యోతి): మహిళా సంఘాలకు ఏటా రూ.20 వేల కోట్ల రుణాలు ఇవ్వాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు అన్నారు. తొలి ఏడాదిలోనే రూ.21వేల కోట్లకు పైగా రుణాలు ఇచ్చామని తెలిపారు. మంగళవారం షాద్‌నగర్ పట్టణంలోని రెడ్ రోజ్ ఫంక్షన్ హాలులో ఇందిరమ్మ మహిళా శక్తి సంబురాలను ప్రారంభించారు. అనంతరం మహిళా శక్తి సంఘాలకు రూ. 3.29 కోట్ల చెక్కును మహిళా సంఘాలకు అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ గత ప్రభుత్వం మహిళాభివృద్ధి, విద్య, వైద్యాన్ని నిర్లక్ష్యం చేసిందని ఆరోపించారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయడమే లక్ష్యంగా పని చేస్తుందని, వారిని పారిశ్రామికవేత్తలుగా ఎదిగేలా కృషి చేస్తుందన్నారు. గత ప్రభుత్వం చేసిన అప్పులకు రూ.7 వేల కోట్లు మిత్తీలు కడుతూనే ఇచ్చిన హామీలను అమలు చేస్తున్నామన్నారు. మహిళా అభివృద్ధి కోసం ప్రతి మండలానికి ఒక పెట్రోల్ బంక్ తోపాటు సోలార్ యూనిట్ ఏర్పాటుకు రూ.కోటి అందించేందుకు కార్యచరణ రూపొందిస్తుందని తెలిపారు. ఉచిత బస్సుల్లో

మిగతా 8వ పేజీలో...



మహిళా సంఘాలకు చెక్కు అందజేస్తున్న మంత్రి శ్రీధర్ బాబు

కాంగ్రెస్‌కు మహిళలు అండగా ఉండాలి: ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్



మహిళా సంక్షేమానికి పాటుపడుతున్న కాంగ్రెస్‌కు మహిళలు అండగా నిలవాలని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ కోరారు. అర్హులైన పేదలందరికీ రేషన్ కార్డులు అందిస్తున్నామని తెలిపారు. అనంతరం కలెక్టర్ నారాయణ రెడ్డి మాట్లాడుతూ జిల్లాలో బ్యాంకు లింకేజీ ద్వారా మహిళా సంఘాలకు రూ.1,000 కోట్లు వడ్డీలేని రుణాలు అందించనున్నట్లు చెప్పారు. ప్రతి గ్రూపునకు రూ.20లక్షలు లభించే అవకాశం ఉందని, సభ్యులు సమష్టిగా మంచి యూనిట్లు ఎంచుకుని ఆర్థికంగా అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు.



ప్రహరీల్లేని ప్రభుత్వ పాఠశాలలు 6
పశువులు, మేకల సంచారం
విద్యార్థులు, టీచర్లకు తప్పని ఇబ్బందులు

ఖద్దర్ వేసుకుంది కలెక్షన్లకు కాదు 7
సామాజిక సేవకు ప్రజలిచ్చిన అవకాశం
ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్



ఘనంగా కట్టమైసమ్మ బోనాలు

కట్టమైసమ్మ బోనాలను షాబాద్‌లో మంగళవారం ఘనంగా నిర్వహించారు. మహిళలు బోనాలతో వెళ్లి అమ్మకు నైవేద్యం సమర్పించారు. బోనాల ముందు యువకుల తొట్టెల ఊరేగింపు సందడిగా సాగింది. బోనాల సందర్భంగా అమ్మ వారి ఆలయాన్ని విద్యుత్ కాంతులతో ముస్తాబు చేశారు. ఉదయం నుంచి గ్రామస్తులు ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. బోనాల ఊరేగింపులో శివసత్తుల పూనకాలు, పోతరాజుల విన్యాసాలు ఆకట్టుకున్నాయి. వర్షాలు సమృద్ధిగా కురిసి, పాడిపంటలను చల్లంగా చూడాలని వేడుకున్నారు.

షాబాద్, జూలై 22(ఆంధ్రజ్యోతి)

స్కాలర్‌షిప్‌లు విడుదల చేయాలి

షాద్‌నగర్ అర్బన్, జూలై 22 (ఆంధ్రజ్యోతి): పెండింగ్ స్కాలర్‌షిప్‌లను వెంటనే విడుదల చేయాలని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా ఉపాధ్యక్షుడు వండ్ల శ్రీకాంత్ డిమాండ్ చేశారు. మంగళవారం విద్యార్థులతో కలిసి షాద్‌నగర్ పట్టణంలో ర్యాలీ నిర్వహించి, చౌరస్తాలో రాస్తారోకో చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యకు ప్రాధాన్యం ఇస్తున్నామని చెబుతున్న సీఎం రేవంత్‌రెడ్డి పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్‌లను ఎందుకు విడుదల చేయడం లేదని ప్రశ్నించారు. ఈ నిరసనలో నాయకులు సుమయిర్, శివశంకర్, ఆదిల్, యూసుఫ్, మజర్, మహేష్, రెహమాన్ తదితరులు పాల్గొన్నారు.



షాద్‌నగర్‌లో ర్యాలీ తీస్తున్న విద్యార్థులు, ఎస్ఎఫ్ఐ నాయకులు

గోడౌన్లకు భూమి కేటాయించని తహసీల్దార్

● అధికారి తీరుపై సొసైటీ చైర్మన్ ఆవేదన


మాట్లాడుతున్న చైర్మన్ రాంరెడ్డి

ఘట్‌కేసర్, జూలై 22 (ఆంధ్రజ్యోతి): ఘట్‌కేసర్ సహకార సంఘం గోడౌన్ల నిర్మాణానికి ప్రభుత్వం అమోదం తెలిపినా స్థానిక అధికారులు స్పందించడం లేదని ఘట్‌కేసర్ సొసైటీ చైర్మన్ సింగిరెడ్డి రాంరెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ.. దేవుడు వరమిచ్చినా పూజారి కరుణించలేదన్న చందంగా ఘట్‌కేసర్ తహసీల్దార్ తీరుందని వాపోయారు. రైతుల సౌకర్యానికి సంబంధించిన అంశాన్ని తేలికగా తీసుకోవడం సరికాదన్నారు. గత అక్టోబరులో సొసైటీ పాలకవర్గం, రైతుల కలిసి కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి వజ్రేశ్‌యాదవ్‌కు గోడౌన్ల నిర్మాణం కోసం విజ్ఞప్తి చేశామని గుర్తు చేశారు. ఆయన ఐటీ శాఖ మంత్రి శ్రీధర్‌బాబుకు సమస్యను వివరించారన్నారు. గోడౌన్ల నిర్మాణానికి భూమి కేటాయించాలని రెవెన్యూ శాఖ అధికారులను ఆదేశించారన్నారు. ఇందుకు సొసైటీ ఫీజు సైతం చెల్లించాలని సూచించారన్నారు. ఎదులాబాద్ పరిధి సర్వే నంబరు 1,089లో 5.20 ఎకరాల స్థలాన్ని కేటాయించాలని అధికారులు నిర్ణయించారు. జాగ డాక్యుమెంట్లను సీసీఎల్‌ఏ నుంచి తెచ్చి అందజేసినా తహసీల్దార్ పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశాడు. ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకుపోయామని చెప్పారు. తహసీల్దార్ స్పందించకుంటే రైతులతో కలిసి ఆందోళనలు చేస్తామని హెచ్చరించాడు. ఇదే విషయమై తహసీల్దార్ రజని వివరణ కోరగా ఆమె స్పందించలేదు.

'మాన్సూన్' యాక్షన్ ప్లాన్ అమలేది?

● కంట్రోల్ రూమ్, స్పెషల్ టీంలను ఏర్పాటు చేయని అధికారులు

తాండూరు, జూలై 22(ఆంధ్రజ్యోతి):కలెక్టర్ ఆదేశించినా సీడీఎంఏ చెప్పినా తాండూరు మునిసిపల్ అధికారుల్లో మార్పు రావడం లేదు. వర్షాకాలం వరద ప్రాంతాల్లో సహాయ కార్యక్రమాలను చేపట్టేందుకు ఏట జూన్‌లో 'మాన్సూన్' యాక్షన్‌ప్లాన్‌ను అమలు చేస్తారు. ఈ మేరకు గత రెండేళ్ల మున్సిపాలిటీలో ముందస్తు చర్యలు చేపట్టారు. ఈ యేడాది మాత్రం మున్సిపాలిటీలో కంట్రోల్ రూమ్ గానీ, ఎమర్జెన్సీ రెస్పాన్స్ టీమ్‌ల ఏర్పాటుకు గానీ చర్యలు తీసుకోలేదు. 12గంటల పాటు ఒక టీమ్ అందుబాటులో ఉండేలా రెండు టీమ్‌లను ఏర్పాటు చేయాల్సి ఉంటుంది. ఈ బృందాలకు వాటర్‌ప్రూఫ్ జాకెట్లు, ఫస్టెయిడ్ కిట్లు, ఆటో, ట్రాక్టర్లు అందుబాటులో ఉంచాలి. దీని కోసం ఇప్పటి వరకు చర్యలు తీసుకోలేదు. గత సోమవారం నుంచి మంగళవారం తెల్లవారు జాము వరకు భారీ వర్షంతో కాలనీలు జలమయ్యాయి. క్విక్ రెస్పాన్స్ టీంలతో అవసరం మేరకు చర్యలు తీసుకోవాల్సి ఉంది.

ముగిసిన 'శివ మహాపురాణం'


శివ మహాపురాణం కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి, స్థానిక భక్తులు

తాండూరు, జూలై 22(ఆంధ్రజ్యోతి): తాండూరు రాజస్థానీ మహిళా మండలి ఆధ్వర్యంలో నిర్వహించిన 'శివ మహా పురాణం' కార్యక్రమం మంగళవారం ముగిసింది. రాజస్థానీయుల సంప్రదాయం ప్రకారం ఐదు రోజులు ఈ కార్యక్రమాన్ని తాండూరులోని గగ్రాని గార్డెన్స్‌లో నిర్వహించారు. కార్యక్రమంలో తాండూరు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి పాల్గొన్నారు. జైపూర్ పండిత్ మదన్మోహన్‌స్వామి ప్రవచనాలు, ధార్మిక ఉపన్యాసాలు ఆకట్టుకున్నాయి. భక్తి సంకీర్తనలతో మహిళలు అలరించారు. అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రాజస్థానీ మహిళా మండలి అధ్యక్షురాలు కిరణ్‌మన్మోహన్ సార్డా, కార్యదర్శి వర్షాకైలాస్, కోశాధికారి కల్పనఆనంద్ రాఠీ, హేమగోవింద్ సోని, వైజయంతిభగవాన్‌దాస్, రాధికామధుసూదన్, రీతూసంజయ్, ప్రోగ్రామ్ నిర్వాహకులుగా కుంజ్ బిహారిసోనీ, దీపక్ గగ్రాని, సంజయ్ సోని, మన్మోహన్ అగర్వాల్ తదితరులు పాల్గొన్నారు.

పేద విద్యార్థులకు చేయూతనిస్తాం


కళ్లద్దాలు పంపిణీ చేస్తున్న ప్రతినిధులు

మంచాల, జూలై22(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో చదివే పేద విద్యార్థులకు చేయూతనందిస్తామని జనసందేశ్ ఫౌండేషన్ చైర్మన్ గోగిరెడ్డి లచ్చిరెడ్డి అన్నారు. మంచాల ప్రభుత్వ పాఠశాలలో దృష్టిలోపం ఉన్న విద్యార్థులకు మంగళవారం ఫౌండేషన్ ఆధ్వర్యంలో కళ్లద్దాలు పంపిణీ చేశారు. లచ్చిరెడ్డి మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో ఫౌండేషన్ ఆధ్వర్యంలో సామాజిక సేవలు విస్తృతం చేస్తామని చెప్పారు. ఫౌండేషన్ ప్రధాన కార్యదర్శి దన్నె బాషయ్య, ఎంఈవో రాందాస్, వైద్యశిబిరం నిర్వాహకులు భిక్షపతి, కో-ఆర్డినేటర్ అశ్వాల బాల్‌రాజ్, ఓరుగంటి శ్రీనివాస్, హెచ్‌ఎం రూబియానా, నారాయణరెడ్డి, గ్రామస్థులు పాల్గొన్నారు.

ఆలయంలోకి వరద రాకుండా కాలువ ఏర్పాటు



మేడ్చల్ టౌన్, జూలై 22(ఆంధ్రజ్యోతి): మేడ్చల్ పట్టణ 4వ వార్డు కిష్టాపూర్‌లోని ఎల్లమ్మ ఆలయంలోకి వర్షం నీరు చేరుతోంది. దీంతో వరద నీరు మళ్లించేందుకు మున్సిపల్ అధికారులు కాలువ తవ్వించారు. ఇటీవలి వర్షానికి ఎల్లమ్మ ఆలయంలో వర్షం నీరు చేరి ఆలయం నీటి మునిగింది. దీంతో భక్తులకు ఇబ్బందులు కలగడంతో కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షుడు వేముల శ్రీనివాస్‌రెడ్డి ఈ విషయాన్ని మున్సిపల్ అధికారుల దృష్టికి తీసుకుపోయారు. దీంతో వారు ఆలయం వద్దకు వర్షపు నీరు చేరకుండా ప్రత్యేకంగా కాలువను ఏర్పాటు చేశారు.

ప్రహరీల్లేని ప్రభుత్వ పాఠశాలలు

● స్కూళ్ల ఆవరణలో పశువులు, గొర్లుమేకల సంచారం
● స్థలాలకు రక్షణ కరువు ● విద్యార్థులు, టీచర్ల ఇబ్బందులు
● నిర్మాణానికి చొరవచూపని అధికారులు, ప్రజాప్రతినిధులు


విశాలంగా భవనం నిర్మించినా ప్రహరీ కట్టని కడ్తాలలోని బాలుర ఉన్నత పాఠశాల

ఆమనగల్లు, జూలై 22(ఆంధ్రజ్యోతి):ప్రభుత్వ ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలకు అనేక చోట్ల ప్రహరీలు, గేట్లు లేక పశువులు, గొర్లుమేకలు పాఠశాలల ఆవరణలో సంచరిస్తున్నాయి. రూ.లక్షలు వెచ్చించి పాఠశాలల భవనాల, గదుల నిర్మాణం చేపడుతున్న ప్రభుత్వం ప్రహరీల నిర్మాణాలపై దృష్టిపెట్టడం లేదు. గ్రామాలు, తండాల పాఠశాలల సంగతి ఎలా ఉన్నా ఉన్నత పాఠశాలలకు సైతం ప్రహరీ గోడలు లేక విద్యార్థులు, ఉపాధ్యాయులు ఇబ్బందులు పడుతున్నారు. ఆమనగల్లు, కడ్తాల మండలాల పరిధిలో 78 ప్రభుత్వ పాఠశాలలున్నాయి. 54 ప్రాథమిక, 9 అప్పర్ ప్రైమరీ, పది ఉన్నత, రెండు కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలలు, సోషల్ వెల్ఫేర్ పాఠశాలలున్నాయి. అన్ని పాఠశాలల్లో కలిపి


ప్రహరీకి నోచుకోని ఆమనగల్లు కస్తూర్బా గాంధీ పాఠశాల

4,250 మంది విద్యార్థులు చదువుతున్నారు. అయితే పాఠశాలల ప్రహరీల నిర్మాణానికి ప్రజాప్రతినిధులు, అధికారులకు స్థానికులు విన్నవిస్తున్నా స్పందన లేదు. ఏటా కొన్ని పాఠశాలల్లో అదనపు గదులు నిర్మిస్తున్నా ప్రహరీల నిర్మాణంపై మాత్రం పట్టించుకోవడం లేదు. హరితహారం కార్యక్రమంలో పాఠశాలల ఆవరణల్లో విద్యార్థులు, ఉపాధ్యాయులు కష్టపడి మొక్కలు పెంచినా కాంపౌండ్‌వాల్స్ లేక మొక్కలు పశువులకు ఆహారంగా మారాయి. పాఠశాల సామగ్రికి సైతం రక్షణ లేకుండా పోయింది. కొన్నిచోట్ల గ్రామస్తులు పాఠశాలల ఆవరణలోనే మలమూత్ర విసర్జన చేస్తున్నారు. ప్రహరీల నిర్మాణానికి అధికారులు, ప్రజాప్రతినిధుల ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపుతున్నా నిధులు విడుదల కావడం లేదు. కడ్తాల జిల్లా పరిషత్ బాలుర పాఠశాలకు ఏడేళ్ల క్రితం మూడెకరాల స్థలంలో విశాలంగా భవనం నిర్మించినా ప్రహరీ నిర్మించలేదు. దీంతో స్కూల్ స్థలానికి రక్షణ లేకుండా పోయింది. ఆమనగల్లు కస్తూర్బా పాఠశాలకు కూడా ప్రహరీ లేక కోతులు, పశువులు సంచరిస్తూ విద్యార్థినులు ఇబ్బందులు పడుతున్నారు. ఇదిలా ఉంటే గ్రామాలు, తండాల్లోని ప్రాథమిక పాఠశాలల పరిస్థితి మరీ అధ్వానంగా ఉంది. ప్రహరీలు లేక కొన్ని చోట్ల పాఠశాలల స్థలాలు సైతం కబ్జా అవుతున్నాయి. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, అధికారులు పాఠశాలలకు ప్రహరీల నిర్మాణానికి నిధుల మంజూరుకు చొరవ తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

కాంపౌండ్ వాల్స్ నిర్మించాలి



ప్రహరీ గోడలు లేని అన్ని పాఠశాలలకు వెంటనే కాంపౌండ్ల వాల్స్‌ను నిర్మించాలి. ఈ విషయంలో ప్రజాప్రతినిధులు, అధికారులు ప్రత్యేక చొరవ తీసుకోవాలి. ప్రభుత్వం కోట్ల రుపాయలు వెచ్చించి పాఠశాలల ఆవరణలలో మొక్కలు నాటుతోంది. కాగా ప్రహరీలు లేక నాటిన మొక్కలకు రక్షణ లేకుండాపోయింది. ప్రహరీలు లేని కారణంగా పాఠశాలల ఆవరణను అశుభ్రంగా మారుతున్నారు. ప్రభుత్వం ప్రహరీల నిర్మాణానికి ప్రత్యేక నిధులు కేటాయించాలి.

- క్యామ శ్రీకాంత్, ఏబీవీపీ నాయకుడు, కడ్తాల్

ప్రభుత్వానికి నివేదించాం



ఆమనగల్లు మండలంలోని మూడు ప్రాథమిక, కేజీబీవీ పాఠశాలకు ప్రహరీలు లేవు. ఆయా పాఠశాలలకు ప్రహరీల నిర్మాణం గురించి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాం. ఉన్నతాధికారులకు సైతం సమస్యపై నివేదించాం. ఎమ్మెల్యే, ఎంపీలను కలిసి నిర్మాణాల గురించి విన్నవించగా సానుకూలంగా స్పందించారు. నిధులు విడుదలైతే ప్రహరీలు నిర్మిస్తాం.

- పాండు, ఎంఈఓ, ఆమనగల్లు

రాష్ట్రంలో పారదర్శక పాలన


చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి

ఆమనగల్లు, జూలై 22(ఆంధ్రజ్యోతి): పేదల ఆర్థికాభివృద్ధి, ఆత్మ గౌరవం పెంపే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం పథకాలను అమలు చేస్తోందని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. పేదలు ఆనందంగా ఉంటే ఓర్వలేని విపక్షాలు విషప్రచారానికి ఒడిగడుతున్నాయని ఆరోపించారు. ఆమనగల్లు, కడ్తాల్ మండలాల్లో మంగళవారం ఆయన పర్యటించి అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొన్నారు. లబ్ధిదారులకు సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు. ఎమ్మెల్యే కసిరెడ్డి మాట్లాడుతూ.. ఎన్నికలకు ముందు ఇచ్చిన ప్రతీ హామీని ప్రభుత్వం అమలుచేస్తుందన్నారు. పేదలకు ఇళ్లు, రేషన్‌కార్డులు మంజూరు చేస్తున్నామన్నారు. కల్వకుర్తి నియోజకవర్గంలో రూ.600కోట్లతో రోడ్లను అభివృద్ధి చేస్తున్నట్లు తెలిపారు. హైదరాబాద్‌కు చేరువలో ఉన్న కల్వకుర్తి ప్రాంతం వేగవంతంగా అభివృద్ధి చెందుతుందన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ ఘనవిజయం సాధిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. కార్పొరేట్‌కు దీటుగా ప్రభుత్వాసుపత్రులను తీర్చిదిద్ది వైద్య సేవలందిస్తున్నట్లు తెలిపారు. పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ కిషన్‌రెడ్డి, నాయకులు కొండల్‌రెడ్డి, ఓంప్రకాశ్‌రెడ్డి, యాదయ్యగౌడ్, జగన్, సాయిరెడ్డి, అంజన్‌రెడ్డి, సురేందర్‌రెడ్డి, భాస్కర్‌రావు పాల్గొన్నారు.

ఖర్గేకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన స్పీకర్



వికారాబాద్, జూలై 22(ఆంధ్రజ్యోతి): రాజ్యసభలో ప్రతిపక్ష నేత, ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేను సోమవారం రాత్రి ఢిల్లీలో రాష్ట్ర అసెంబ్లీ స్పీకర్ ప్రసాద్‌కుమార్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఖర్గే జన్మదినాన్ని పురస్కరించుకొని ఆయనకు శుభాకాంక్షలు తెలియజేశారు.

నాలాలు, కల్వర్టులను పునరుద్ధరించాలి

ఘట్‌కేసర్, జూలై 22(ఆంధ్రజ్యోతి):ఘట్‌కేసర్‌లోని పాత జాతీయ రహదారి కింద ఉన్న నాలాలను, కల్వర్టులను పునరుద్ధరించి ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని స్థానికులు మంగళవారం కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఘట్‌కేసర్‌లోని ఓఆర్‌ఆర్ చౌరస్తా నుంచి మాధవరెడ్డి రైల్వే వంతెన వరకు 2.2కిలోమీటర్ల మేర రోడ్డు నిర్మాణం, వెడల్పు కార్యక్రమాలు జరుగుతున్నాయని వివరించారు. ఘట్‌కేసర్‌లోని విద్యుత్ సబ్‌స్టేషన్ నుంచి అంబేడ్కర్ చౌరస్తా వరకు నిజాం కాలం నుంచి అప్పటి జాతీయ రహదారి కింద ఉన్న నాలాలు, కల్వర్టులను ఆక్రమించడంతో 2020లో వరదలొచ్చి ఘట్‌కేసర్ జలదిగ్బంధమై నష్టం సంభవించిందని తెలిపారు. ఘట్‌కేసర్‌లో ఆరు కల్వర్టులు ఉన్నట్లు ఫిర్యాదులో వివరించారు. 1997లో రోడ్డు విస్తరణ సమయంలో కొన్ని కల్వర్టులను ఆక్రమించారని తెలిపారు. ప్రస్తుతం రోడ్డు విస్తరణ పనులు జరుగుతున్నందున ఆక్రమణకు గురైన నాలాలను, కల్వర్టులను పునరుద్ధరించి వరద రాకుండా చర్యలు చేపట్టాలని ఫిర్యాదులో వివరించారు.

అక్రమంగా మద్యం విక్రయం.. రూ.లక్ష జరిమానా

శంకర్‌పల్లి, జూలై 22(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ అనుమతిలేకుండా మద్యం విక్రయించడంతో పాటు బైండోవర్ నిబంధనలు ఉల్లంఘించిన వ్యక్తికి రూ.లక్ష జరిమానా విధించిన ఘటన శంకర్‌పల్లి మండలంలోని మోకిలలో మంగళవారం చోటుచేసుకుంది. చేవెళ్ల ఎక్సైజ్ సీఐ శ్రీలత తెలిపిన వివరాల ప్రకారం.. మోకిల రెవెన్యూ పరిధి కేకే దాబాను ముక్తార్ అలీ అనే వ్యక్తి కొంతకాలంగా నిర్వహిస్తున్నాడు. అందులో అక్రమంగా మద్యం విక్రయిస్తున్నాడు. దాడి చేసి ముక్తార్ అలీపై కేసు నమోదు చేసి గత నెలలోనే శంకర్‌పల్లి తహసీల్దార్ సమక్షంలో బైండోవర్ చేసినట్లు తెలిపారు. ముక్తార్ అలీ బైండోవర్ నిబంధనలు అతిక్రమించడంతో రూ.లక్ష జరిమానా విధించినట్లు ఎక్సైజ్ సీఐ చెప్పారు. ఎక్సైజ్ ఎస్సై వెంకటేశ్వర్‌రెడ్డి, పోలీస్ సిబ్బంది ఉన్నారు.

ఇందిరమ్మ ఇళ్లకు ఇసుక ఇవ్వండి


ఆందోళన చేస్తున్న ఇళ్ల లబ్ధిదారులు

పెద్దేముల్, జూలై 22(ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మ ఇళ్లకు ఇసుక ఇవ్వాలని లబ్ధిదారులు తహసీల్దార్‌తో మొరపెట్టుకున్నారు. గొట్లపల్లికి చెందిన లబ్ధిదారులు ఇంటి నిర్మాణానికి ఇసుక అవసరం ఉందని, ఇసుక పర్మిట్లు కావాలని తహసీల్దార్ వెంకటేశ్‌ప్రసాద్‌ను కోరారు. తాము పర్మిట్ ఇచ్చినా వాగు నుంచి రైతులు ఇసుక తోడుకోనివ్వడం లేదని తెలిసిందని, ఇదే విషయమై చాలా మంది ఫిర్యాదులు చేస్తున్నారని అధికారి చెప్పారు. రైతులు ఇసుక తోడుకోనివ్వకుంటే పర్మిట్లు వృథా అవుతాయి కాబట్టి రెండు మూడు రోజులు ఆగాలన్నారని లబ్ధిదారులు వాపోయారు. ఇసుక లేకుంటే ఇళ్లు ఎలా నిర్మించుకోవాలని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఉన్నతాధికారులు ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు ఇసుక అందించే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు.

రేపటి నుంచి రంగనాయక స్వామి బ్రహ్మోత్సవాలు


ఎదులాబాద్ రంగనాయకస్వామి ఆలయం

ఘట్‌కేసర్ రూరల్, జూలై 22(ఆంధ్రజ్యోతి): ఎదులాబాద్‌లోని గోదా సమేత శ్రీ మన్నారు రంగనాయకస్వామి బ్రహ్మోత్సవాలు రేపటి (గురువారం) నుంచి ఈ నెల 31 వరకు జరుగుతాయని ఆలయ ధర్మకర్తలు మంగళవారం తెలిపారు. ఈ నెల 24న విశ్వక్సేనారాధన, పుణ్యాహఃవచనం, మత్సంగ్రహణం, అంకురార్పణ, ఆరగింపు, 25న నిత్యవిధి, ధ్వజారోహణం, భేరిపూజ దేవతాహ్వానం, 26న నిత్యవిధి, శేషవాహన సేవ, హనుమంత వాహనసేవ కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. 27న అశ్వవాహన సేవ, గజవాహన సేవ, 28న గరుడ వాహనసేవ, గోదాదేవి తిరునక్షత్రం గోదారంగనాకయస్వామి కల్యాణం, 29న నిత్యవిధి, దివ్య విమాన రథోత్సం ఉంటాయని తెలిపారు. 30న మహాపూర్ణాహుతి, దేవతోద్వాసన, ద్వాదశారాధన, శ్రీ పుష్పయాగం, గాందోళి ఉత్సవం, చక్రతీర్థం, 31స్వామి వారి ఘటాభిషేకం మహదాశీర్వచన కార్యక్రమాలుంటాయని ఆలయ వంశస్థులు వివరించారు.

కందనెల్లి సబ్ సెంటర్‌లో టీబీ పరీక్షలు


టీబీ పేషంట్లకు పౌష్టికాహారాన్ని అందజేస్తున్న వైద్యులు

పెద్దేముల్, జూలై22(ఆంధ్రజ్యోతి):కందనెల్లి గ్రామంలోని సబ్‌సెంటర్‌లో మంగళవారం ప్రాథమిక ఆరోగ్యకేంద్రం ఆధ్వర్యాన టీబీ పరీక్షలు నిర్వహించారు. డాక్టర్ బుచ్చిబాబు మాట్లాడుతూ.. ప్రభుత్వం టీబీ ముక్త్ భారత్ కార్యక్రమాన్ని చేపట్టిందని తెలిపారు. ఈ కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. టీబీ వ్యాధి లక్షణాలు ఉన్న వారికి పరీక్షలు నిర్వహించి ఎక్స్‌రేల కోసం ప్రభుత్వ జిల్లా సుపత్రికి పంపించామని తెలిపారు. టీబీ వ్యాధి నిర్ధారణైతే 6నెలలు ఉచిత మందులు, పోషణ కోసం ప్రభుత్వం తరఫున నెలకు వెయ్యి ఇస్తామని చెప్పారు. టీబీ వ్యాధిగ్రస్తులకు పౌష్టికాహార కిట్లు అందజేశారు. కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పీలు డాక్టర్ ప్రమోద్‌కుమార్, రసూల్, సూపర్‌వైజర్ పుష్పలత, సుగుణ, ఏఎన్‌ఎం స్వప్న పాల్గొన్నారు.

విద్యార్థులకు బ్యాగుల అందజేత


బ్యాగులను అందజేస్తున్న దాతలు

చేవెళ్ల, జూలై 22(ఆంధ్రజ్యోతి):ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు దాతలు చేయూతనివ్వడం అభినందనీయమని గొల్లపల్లి, ధర్మసాగర్ పాఠశాలాల హెచ్‌ఎంలు స్వామి, ఉషారాణి అన్నారు. మంగళవారం మండల పరిధిలోని ఆయా పాఠశాలల్లో విద్యార్థులకు జీఎస్సీ సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో చైర్మన్ జి.చందు బ్యాగులు, స్టేషనరీ అందించారు. ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

రోగికి మాజీ ఎంపీపీ పరామర్శ

కేశంపేట, జూలై 22(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని చింతకుంటపల్లి గ్రామానికి చెందిన బైకని బాలమ్మ తీవ్ర అనారోగ్యానికి గురై షాద్‌నగర్ పట్టణంలోని బుగ్గారెడ్డి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. విషయం తెలుసుకున్న కేశంపేట మండల మాజీ ఎంపీపీ రవీందర్‌యాదవ్ మంగళవారం ఆసుపత్రికి వెళ్లి బాలమ్మ ఆరోగ్య పరిస్థితి తెలుసుకున్నారు. మెరుగైన వైద్యం అందించాలని ఆసుపత్రి యాజమాన్యాన్ని కోరారు. అలాగే ఆమె కుటుంబ సభ్యులతో మాట్లాడారు. మాజీ ఎంపీపీ వెంట బీఆర్‌ఎస్ యువ నాయకుడు పోచమోని రమేష్ తదితరులు ఉన్నారు.

రోడ్డును కట్‌చేసిన వ్యక్తికి జరిమానా

శంకర్‌పల్లి, జూలై 22(ఆంధ్రజ్యోతి):శంకర్‌పల్లి మున్సిపాలిటీ పరిధి రామంతపూర్ వార్డులో కొత్తగా వేసిన సీసీ రోడ్డును జానంపేట రాములు మున్సిపాలిటీ నుంచి అనుమతి తీసుకోకుండా కట్ చేశాడు. దీంతో మున్సిపల్ అధికారులు మంగళవారం రామంతాపూర్ వార్డును సందర్శించి అనుమతి లేకుండా సీసీ రోడ్డు తవ్విన రాములుకు మున్సిపల్ అధికారులు రూ.20వేల జరిమానా విధించారు. రోడ్డు కట్ చేయాలంటే అధికారుల అనుమతి తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో అధికారులు, సిబ్బంది ఉన్నారు.

నాగాలయంలో విగ్రహ ప్రతిష్ఠాపన

ఘట్‌కేసర్ రూరల్, జూలై 22(ఆంధ్రజ్యోతి):ఎదులాబాద్ వంజరివాడలోని నాగాలయంలో మంగళవారం విగ్రహ ప్రతిష్ఠాపనను వైభవంగా నిర్వహించారు. ఉదయం నాగదేవత ఆలయంలోని పుట్టకు పూజలు చేసి పాలు, పండ్లు సమర్పించారు. అనంతరం నాగదేవత విగ్రహాన్ని వేదపండితుల మంత్రోచ్ఛరణల మధ్య గ్రామానికి చెందిన సాల్వేరు రమేష్ దంపతులు ప్రతిష్ఠించారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో కీసరగుట్ట ఆలయ కమిటీ సభ్యుడు అమరేందర్, సామల నవీన్ పాల్గొన్నారు.


పుట్టకు పూజలు చేస్తున్న బొట్టు రమేష్ దంపతులు

ప్రతీ ఒక్కరు మొక్కలు నాటాలి


రాచులూరులో మొక్కలను నాటుతున్న నర్సిరెడ్డి, అధికారులు

కందుకూరు, జూలై 22(ఆంధ్రజ్యోతి): ప్రతీ ఒక్కరు మొక్కలు నాటి సరక్షంచే బాధ్యత తీసుకోవాలని మైనింగ్ ఎండీ నర్సిరెడ్డి, ఎఫ్‌ఆర్‌వో పి.భావన అన్నారు. మంగళవారం రాచులూరులో ఉన్న రాక్ శాండ్ మినరల్ ప్రైవేట్ కంపెనీ ఆధ్వర్యంలో వన మహోత్సవాన్ని నిర్వహించారు. 500 మొక్కలను నాటారు. కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. గతంలో చెట్లు అధికంగా ఉండడం వలన వర్షాలు సకాలంలో కురిసేవని గుర్తు చేశారు. సాగు, వెంచర్ల ఏర్పాటుతో చెట్లను తొలగించారన్నారు. వాతావరణ కాలుష్యంతో సమస్యలు ఎదురవుతున్నాయని తెలిపారు. ప్రతీ సంవత్సరం ఒక్కొక్కరు ఐదు మొక్కలు నాటి సంరక్షించాలన్నారు. రాక్ శాండ్ మినరల్స్ ఎండీ పి.పూర్ణచంద్, పీఆర్వో డీఎస్.దీక్షితులు పాల్గొన్నారు.


బంగారం దుకాణాదారులు అప్రమత్తంగా ఉండాలి


సమావేశంలో మాట్లాడుతున్న సీఐ పందిరి పరశురాం

ఘట్‌కేసర్ రూరల్, జూలై 22(ఆంధ్రజ్యోతి): బంగారం, పాన్ బ్రోకర్ దుకాణాదారులు అప్రమత్తంగా ఉండాలని సీఐ పరశురాం అన్నారు. ఘట్‌కేసర్ పోలీస్‌స్టేషన్‌లో మంగళవారం చోరీలపై అవగాహన కల్పించారు. ఇటీవల సూర్యాపేట్‌లో బంగారం దుకాణంలో జరిగిన చోరీ గురించి వివరించారు. సెంట్రల్ లాకింగ్ సిస్టం, స్మోక్ అలారం సిస్టం, 24/7 సెక్యూరిటీ, డబుల్ గ్రిల్ కలిగిన కిటికీలు, సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎస్సై శేఖర్, బంగారం, పాన్ బ్రోకర్ దుకాణాల యజమానులు తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన పవిత్రోత్సవాలు

» చివరి రోజు విశేష హోమాలు



పూజా కార్యక్రమాలు నిర్వహిస్తున్న పురోహితులు

కొడంగల్, జూలై 22 (ఆంధ్రజ్యోతి): కలియుగ వైకుంఠ శ్రీనివాసుడి పవిత్రోత్సవాలు గోవింద నామస్మరణతో ముగిశాయి. రెండేళ్లకోసారి నిర్వహించే పవిత్రోత్సవాల్లో భాగంగా స్థానిక వేంకటేశ్వరస్వామి ఆలయంలో మూడు రోజుల పాటు కార్యక్రమాలను వైభవంగా నిర్వహించారు. చివరి రోజు మంగళవారం విశేష హోమాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమాల్లో తాండూర్ ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి, ఆర్యవైశ్య కార్పొరేషన్ రాష్ట్ర చైర్‌పర్సన్ కల్వ సుజాత, కడా ప్రత్యేకాధికారి వెంకట్‌రెడ్డి చారిటబుల్ ట్రస్టు చైర్మన్ వేణుకుమార్, ఆలయ ధర్మకర్తలు, ఈవో రాజేందర్‌రెడ్డి పాల్గొన్నారు. ఉత్సవాల సందర్భంగా సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలు నిర్వహించారు.



వికారాబాద్‌లో ఘనంగా బోనాలు

వికారాబాద్, జూలై 22(ఆంధ్రజ్యోతి): వికారాబాద్‌లోని ఆయా వార్డుల్లో మంగళవారం బోనాల వేడుకలను నిర్వహించారు. ఎన్నెపల్లిలో రెండో రోజు మైసమ్మకు బోనాలు సమర్పించారు. పోతురాజుల విన్యాసాలు, శివసత్తుల పూనకాల మధ్య ఊరేగింపు నిర్వహించారు. ఎన్నెపల్లిలో మాజీ కౌన్సిలర్ అనంత్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకల్లో మాజీ ఎమ్మెల్యే, మెతుకు ఆనంద్ హాజరై అమ్మవారిని దర్శించుకున్నారు. కార్యక్రమాల్లో గ్రామపెద్దలు, మహిళలు పెద్దఎత్తున పాల్గొన్నారు.



పరిగిలో ఫలహార బండి ఊరేగింపు



పరిగి,జూలై 22 (ఆంధ్రజ్యోతి): పరిగిలో మంగళవారం రాత్రి పోచమ్మ తల్లి ఫలహార బండి ఊరేగింపును నిర్వహించారు. పోతురాజుల విన్యాసాలు, ఆట, పాటలతో మధ్య ఊరేగించారు. మాజీ సర్పంచ్ తెలుగు మధుసూదన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఊరేగింపు కార్యక్రమానికి ప్రజలకు భారీగా హాజరయ్యారు. ప్రజాప్రతినిధులు, ఆయా పార్టీల నాయకులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న బీసీ కమిషన్ మాజీ సభ్యుడు శుభప్రద్ పటేల్

తెలంగాణ హక్కులను కాలరాస్తున్న సీఎం

వికారాబాద్, జూలై 22(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తెలంగాణ రాష్ట్ర హక్కులను కాలరాస్తూ ఏపీ రాష్ట్ర నీటి దోపిడీకి అనుకూలంగా మాట్లాడుతున్నారని రాష్ట్ర బీసీ కమిషన్ మాజీ సభ్యుడు శుభప్రద్ పటేల్ ఆరోపించారు. మంగళవారం వికారాబాద్ బీఆర్ఎస్‌వీ నాయకులతో కలిసి విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పోలవరం ప్రాజెక్టు నుంచి 200టీఎంసీల గోదావరి నీటని రాయలసీమకు తరలించుకునేందుకు నిర్మించతలపెట్టిన పోలవరం-బనకచర్ల లింక్ ప్రాజెక్టుకు రేవంత్‌రెడ్డి మద్దతు తెలుపుతున్నారన్నారు. గోదావరి, కృష్ణా నదుల యాజమాన్య బోర్డులు, కేంద్ర జల సంఘం అనుమతుల్లేకుండా ప్రాజెక్టు నిర్మించొద్దన్నారు. అయితే ఏపీ సీఎం చంద్రబాబునాయుడు చట్టాన్ని తుంగలో తొక్కుతూ బనకచర్ల ప్రాజెక్టుకు సన్నాహాలు చేస్తున్నారన్నారు. అక్రమ ప్రాజెక్టును అడ్డుకోవాల్సిన బీజేపీ సైతం వారికే సహరిస్తోందన్నారు. ప్రాజెక్టుకు నిధులు సమకూరుస్తోందని తెలిపారు. రాష్ట్ర నీటి హక్కులను కాపాడాల్సిన సీఎం రేవంత్‌రెడ్డి.. చంద్రబాబు, బీజేపీలకు లొంగిపోయి వారికే సహకరిస్తున్నారన్నారు. ఈ ప్రమాదాన్ని బీఆర్ఎస్ ముందేపసిగట్టి బనకచర్లకు వ్యతిరేకంగా సమరశంఖం పూరించిందని, బీఆర్ఎస్ ఒత్తిడితో రేవంత్‌రెడ్డి ప్రాజెక్టును వ్యతిరేకిస్తున్నట్లు కేంద్రానికి లేఖల డ్రామా మొదలుపెట్టారని ఆరోపించారు. ఆంధ్ర రాష్ట్ర జల దోపిడీని అడ్డుకొని, తెలంగాణ జల వాటాను కాపాడుకునేలా ముందుకువెళ్దామని పిలుపునిచ్చారు. బీఆర్ఎస్ పాలనలో 85శాతం పూర్తయిన పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టును చేపట్టక వికారాబాద్ జిల్లాలో 3లక్షల ఎకరాలకు నీరందే పనులు నిలిచిపోయాయన్నారు. జిల్లా నుంచే ప్రాతినిధ్యం వహిస్తున్న రేవంత్‌రెడ్డి వెంటనే పాలమూరు-రంగారెడ్డి పనులను ప్రారంభించకుంటే రైతులతో కలిసి ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. అనంతరం విశ్వభారతి డిగ్రీ బనకచర్ల ప్రాజెక్టు కడితే జరిగే నష్టంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పార్టీ పట్టణాధ్యక్షుడు గోపాల్, జిల్లా కో-ఆర్డినేటర్ మహిపాల్, వికారాబాద్, చేవెళ్ల, కొడంగల్, తాండూరు, పరిగిల ఇన్‌చార్జిలు మంచన్‌పల్లి సురేష్, గణపురం శాంతికుమార్, ఎరన్‌పల్లి శ్రీనివాస్, భాను, రవికుమార్, నాయకులు బాలరాజ్, రవిశంకర్, సిద్ధిఖీ, మహేశ్, సుభాన్, కృష్ణ, సంతోష్, వరుణ్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంపీడీవో వెంకయ్య

వ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకోవాలి

శంకర్‌పల్లి, జూలై 22(ఆంధ్రజ్యోతి): వర్షాకాలం గ్రామాల్లో సీజనల్ వ్యాధులు రాకుండా తగిన చర్యలు తీసుకోవాలని శంకర్‌పల్లి ఎంపీడీవో వెంకయ్య తెలిపారు. మంగళవారం మండల పరిషత్‌లో అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. వర్షాకాలంలో గ్రామాలు, పట్టణ కేంద్రాల్లో అపరిశుభ్రత లేకుండా చూడాలన్నారు. ఇళ్ల నిర్మాణ పనులు వేగవంతం చేయాలన్నారు. అన్ని గ్రామాల్లో మొక్కలు నాటి సంరక్షణ చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో కమిషనర్ యోగేశ్, తహసీల్దార్ సురేందర్, డీటీ బాలకృష్ణరెడ్డి, గిరిజ పాల్గొన్నారు.

ప్రజాపాలనతో గ్రామాల్లో ప్రగతి



సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే రంగారెడ్డి

ఆదిభట్ల, జూలై 22(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఇందిరమ్మ ప్రజాపాలనతోనే గ్రామాల అభివృద్ధి సాధ్యం అని ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి అన్నారు. మండల పరిధి తులేకలాన్‌లో రూ.40లక్షలతో చేపట్టే సీసీ రోడ్డు పనులకు మంగళవారం శంకుస్థాపన చేశారు. ఆయన మాట్లాడుతూ.. సంక్షేమ పథకలు ప్రజలకు చేరేలా అధికారులు చొరవ తీసుకొని అర్హులందరికీ పథకాలువర్తింపజేయాలన్నారు. తులేకలాన్‌కు సుమారు కోటిన్నర నిధులు మంజూరు చేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ కోడూరు రమేష్, నాయకులు శశాంక్‌రెడ్డి, పాండు, అంజయ్య, కృష్ణ, మహేందర్, జంగయ్య, తేజ, కిరణ్, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

హరీశ్‌రావును కలిసిన నాయకులు

చేవెళ్ల, జూలై 22(ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్ఎస్ గెలుపే లక్ష్యంగా పనిచేయాలని ఎమ్మెల్యే హరీశ్‌రావు అన్నారు. మంగళవారం ముడిమ్యాల్‌కు చెందిన పలువురు బీఆర్ఎస్ నాయకులు, ఏఎంసీ డైరెక్టర్ గోనె కరుణాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో నగరంలో హరీశ్‌రావును మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించారు. వారితో హరీశ్ మాట్లాడుతూ.. కార్యకర్తలు, నాయకులు పార్టీ కోసం మరింత ఉత్సాహంగా పని చేయాలని సూచించారని నాయకులు పేర్కొన్నారు. హరీశ్‌ను కలిసినవారిలో నాయకులు శశిపాల్, శేరిరాజు, ఆరిఫ్, మాధవరెడ్డి, సాయికిరణ్, నందు, శ్రీకాంత్, శివకుమార్, రజినికాంత్, శ్రీకాంత్, కల్యాణ్ ఉన్నారు.



హరీశ్‌రావుతో చేవెళ్ల బీఆర్ఎస్ నాయకులు

రూ.3కోట్లతో కొత్తకుంటను ఆధునికీకరిస్తాం

● పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి



కొత్తకుంటలో గంగమ్మతల్లికి హారతిస్తున్న ఎమ్మెల్యే టి.రామ్మోహన్‌రెడ్డి

పరిగి, జూలై 22(ఆంధ్రజ్యోతి): పరిగి శివారులోని కొత్తకుంటను రూ.3కోట్లతో మినీ ట్యాంకుబండ్‌గా మారుస్తామని పరిగి ఎమ్మెల్యే టి.రామ్మోహన్‌రెడ్డి తెలిపారు. కొత్తకుంటకు ఇటీవల రూ.30లక్షలతో మరమ్మతులు చేయడంతో ఇటీవలి వర్షాలతో అలుగు పారుతోంది. మంగళవారం ఎమ్మెల్యే, స్థానిక నాయకులతో కలిసి గంగమ్మ తల్లికి కొబ్బరికాయ, పూలతో హారతిచ్చారు. ఆయన మాట్లాడుతూ.. పరిగికి ఈశాన్యాన నెలకొన్న కొత్తకుంటతో వాస్తు దృష్ట్యా పట్టణ ప్రజలకు ఎంతో మంచిదన్నారు. 32ఏళ్లుగా ఎవరూ పట్టించుకోలేదని, తాను రెండోసారి ఎమ్మెల్యే కావడం, కాంగ్రెస్ ప్రభుత్వం రాకతో కొత్తకుంట దశ తిరిగిందన్నారు. కుంటను మినీ ట్యాంక్ బండ్‌గా తీర్చిదిద్దుతానని తెలిపారు. కొత్తకుంట ఎఫ్‌టీఎల్ పరిధి 29ఎకరాల్లో చుట్టూ ఫెన్సింగ్ వేయిస్తానని తెలిపారు. కట్టను, అలుగు వెడల్పు చేస్తామన్నారు. కట్టంపై సిమెంట్ ప్లాట్‌ఫామ్, వాకింగ్ ట్రాక్, సెంట్రల్ లైటింగ్, గ్రీనరీ ఏర్పాటు చేస్తామని చెప్పారు. పరిగిని పర్యాటక కేంద్రంగా మారుస్తానని తెలిపారు. పిల్లలు, వృద్ధులు ఆహ్లాదరంగా సేదతీరేలా అవసరమైన అన్ని ఏర్పాట్లు చేస్తానని హామీ స్పష్టం చేశారు. పరిగికే తలమానికంగా నిలిచేలా కుంట బ్యుటిఫికేషన్ పనులు చేపడుతామని ఎమ్మెల్యే చెప్పారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ సిద్ధాంతి పార్థసారథి, తహసీల్దార్ వెంకటేశ్వరి, ఎంపీడీవో కరీం, ఏఎంసీ చైర్మన్ పరశురాంరెడ్డి, డీసీసీ వైస్‌చైర్మన్ ఎం.లాల్‌కృష్ణ, కార్యదర్శి కె.హన్మంత్‌ముదిరాజ్, కాంగ్రెస్ పట్టణాధ్యక్షుడు ఎ.కృష్ణ పాల్గొన్నారు.

కోటి మందిని కోటీశ్వరులను చేయడమే లక్ష్యం

రాష్ట్రంలో కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయడమే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి అన్నారు. క్యాంప్ కార్యాలయంలో మెప్మా ఆధ్వర్యంలో పట్టణంలోని మహిళా సంఘాలకు వడ్డీలేని రుణాల కింద రూ.కోటిన్నర చెక్కును, అనంతరం రేషన్‌కార్డులను అందజేశారు. ఆయన మాట్లాడుతూ.. మహిళలు పారిశ్రామికవేత్తలుగా ఎదగాలని కోరారు. పరిగిలో ఇంటిగ్రేటెట్ స్కూల్‌ను, రూ.32 కోట్లతో ఆస్పత్రి నిర్మాణాన్ని చేపడుతామని తెలిపారు. తహసీల్దార్, ఎంపీడీవో, మెప్మా డీపీ రవికుమార్, సీఐ శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

సీఐ ప్రసంగంపై విమర్శలు

ఎమ్మెల్యే క్యాంప్ కార్యాయలంలో ఎమ్మెల్యే హాజరైన కార్యక్రమంలో పరిగి సీఐ శ్రీనివాస్ రెడ్డి చేసిన ప్రసంగంపై విమర్శలొచ్చాయి. ఇటీవల ఓ ప్రైవేట్ ఆస్పత్రిపై తలెత్తిన వివాదంపై సీఐ మాట్లాడడం దుమారం లేపింది. సీఐ మాట్లాడుతూ.. ప్రైవేట్ ఆస్పత్రుల వద్ద అల్లర్లు, గొడవలు, దాడులుచేస్తే కఠినచర్యలు తీసుకుంటామన్నారు. దీంతో ఒక అధికారిగా ప్రజలు, బాధితుల పక్షాన మాట్లాల్సింది పోయి కార్పోరేట్/ప్రైవేట్ ఆస్పత్రుల తరఫున వకాల్తా పుచ్చుకోవడం ఏమిటని పలువురు అన్నారు.

పేదలందరికీ ఆహార, ఆరోగ్య భద్రత కార్డులు

» మహేశ్వరం కాంగ్రెస్ ఇన్‌చార్జి కేఎల్లార్



మాట్లాడుతున్న కె.లక్ష్మారెడ్డి

మహేశ్వరం, జూలై 22(ఆంధ్రజ్యోతి): ప్రతీ పేద కుటుంబానికి ఆహార, ఆరోగ్య భద్రత కార్డులను అందజేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని మహేశ్వరం కాంగ్రెస్ ఇన్‌చార్జి కిచ్చన్నగారి లక్ష్మారెడ్డి అన్నారు. మంగళవారం తుక్కుగూడలోని కాంగ్రెస్ కార్యాలయంలో ఆయన మాట్లాడారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఒక్క రేషన్ కార్డు కూడా ఇవ్వలేదన్నారు. ఈ నెల 25 నుంచి ఆగస్టు 10 వరకు రాష్ట్రంలో ప్రభుత్వం అర్హులందరికీ రేషన్‌కార్డులను పంపిణీ చేయనుందన్నారు. అలాగే కార్మికులకు రేవంత్‌రెడ్డి సర్కార్ ఆరోగ్య బీమా కల్పిస్తోందన్నారు. రాజీవ్ ఆరోగ్య శ్రీ ద్వారా పేదలకు రూ.10లక్షల వరకు ఖర్చయ్యే చికిత్స, రేషన్‌కార్డుల ద్వారా సన్న బియ్యం ఇస్తున్నామన్నారు. పేదలు దళారులను ఆశ్రయించకుండా నేరుగా ఆయా కార్యాలయాలకు వెళ్లి పథకాలకు దరఖాస్తు చేసుకోవాలన్నారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు, ఎస్సీ వర్గీకరణను కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేయనుందన్నారు. కాంగ్రెస్ సర్కారుకు పెరుగుతున్న ప్రజాదరణను ఓర్వలేకే బీఆర్ఎస్, బీజేపీలు ప్రభుత్వంపై చేస్తున్న ఆరోపణలను ప్రజలు నమ్మడం లేదన్నారు. మహేశ్వరం నియోజకవర్గంలో అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజలకు చేరేసేందుకు కాంగ్రెస్ నాయకులు ముందుండాలని పిలుపునిచ్చారు.



కమిషనర్‌కు వినతిపత్రం ఇస్తున్న బీఆర్ఎస్ నాయకులు

మున్సిపాలిటీలను గ్రేటర్‌లో కలపొద్దు

» ఆదిభట్ల మున్సిపల్ కమిషనర్‌కు బీఆర్ఎస్ వినతి

ఆదిభట్ల, జూలై 22(ఆంధ్రజ్యోతి): రంగారెడ్డి జిల్లాలోని శివారు మున్సిపాలిటీలను జీహెచ్ఎంసీలో కలుపుతామని ప్రభుత్వం తీసుకుంటున్న నిర్ణయం సరికాదని బీఆర్ఎస్ నాయకులు పల్లె శ్రీనివాస్ అన్నారు. ఈ మేరకు మంగళవారం మున్సిపల్ కమిషనర్ బాలకృష్ణకు వినతిపత్రం ఇచ్చారు. అనంతరం మాట్లాడుతూ.. జిల్లాలోని శివారు ప్రాంత మున్సిపాలిటీలను గ్రేటర్ హైదరాబాద్‌లో కలిపితే ప్రజలు వివిధ రకాల ఇబ్బందులకు గురవుతారన్నారు. 2018లో మున్సిపాలిటీగా ఏర్పడిన ఆదిభట్ల ఇప్పుడిప్పుడే అభివృద్ధి చెందుతోందన్నారు. ఇక్కడ గ్రామీణ వాతావరణం ఉన్న వార్డులు ఉన్నాయన్నారు. గ్రేటర్‌లో విలీనం చేస్తే నీటి, ఇంటి పన్నులు విపరీతంగా పెరుగుతాయన్నారు. దీనిపై ప్రభుత్వం పునరాలోచించి మున్సిపాలిటీల విలీనాన్ని ఉపసంహరించుకోవాలన్నారు. కార్యక్రమంలో ప్యాక్స్ డైరెక్టర్ పల్లె శ్రీకాంత్‌గౌడ్, కృష్ణ, మహేందర్ తదితరులు ఉన్నారు.

రిటైర్మెంట్ బెనిఫిట్స్ వెంటనే చెల్లించాలి



మాట్లాడుతున్న గోపాల్‌రెడ్డి

శంషాబాద్, జూలై 22(ఆంధ్రజ్యోతి): రిటైరైన ప్రభుత్వ ఉద్యోగులకు రిటైర్మెంట్ బెనిఫిట్స్‌ను వెంటనే పూర్తిస్థాయిలో చెల్లించాలని తెలంగాణరాష్ట్ర ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎ.గోపాల్‌రెడ్డి డిమాండ్ చేశారు. శంషాబాద్‌లోని సంఘ కార్యాలయంలో మంగళవారం కార్యవర్గ సమావేశాన్ని నిర్వహించారు. గోపాల్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. ప్రస్తుతం ప్రభుత్వం రిటైర్డ్ ఉద్యోగులకు రిటైర్మెంట్ బెనిఫిట్స్‌లో సగమే చెల్లిస్తోందని, అరకొర డబ్బుతో రిటైర్డ్ ఉద్యోగులు ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అలాగే రిటైర్డ్ ఉద్యోగులకు ప్రైవేట్‌లో నగదు రహిత వైద్యాన్ని అందుబాటులోకి తేవాలని కోరారు. సమావేశంలో సంఘం ప్రధాన కార్యదర్శి జగదీశ్వర్, నర్సింగ్‌రావు, శంకర్ సింగ్, టిలీశ్వరయ్య, పలువురు రిటైర్డ్ ఉద్యోగులు పాల్గొన్నారు.

మంత్రికి పార్టీ శ్రేణుల ఘన స్వాగతం



శ్రీధర్‌బాబుకు స్వాగతం పలుకుతున్న పార్టీ శ్రేణులు

నందిగామ, జూలై 22(ఆంధ్రజ్యోతి): ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు మంగళవారం షాద్‌నగర్‌లో నిర్వహించిన ఇందిరా మహిళా శక్తి-ఆర్థిక ప్రగతి కార్యక్రమంలో పాల్గొన్నారు. కాంగ్రెస్ శ్రేణులు నందిగామలో ఎమ్మెల్యే శంకర్ ఆధ్వర్యంలో మంత్రికి ఘనస్వాగతం పలికారు. అనంతరం మండల కేంద్రం నుంచి షాద్‌నగర్‌కు మంత్రి, ఎమ్మెల్యే, మాజీ ఎమ్మెల్యే ప్రతాప్‌రెడ్డి, మాజీ జెడ్పీటీసీ శ్యాంసుందర్‌రెడ్డి, మాజీ ఎంపీపీ శివశంకర్‌గౌడ్‌లు ర్యాలీగా వెళ్లారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండలాధ్యక్షుడు జంగ నర్సింలు, జిల్లెల్ల రాంరెడ్డి, కృష్ణ, కుమార్‌గౌడ్, చంద్రపాల్‌రెడ్డి, కావలి క్రిష్ణ, శ్రీశైలం, శివ, బుచ్చయ్య పాల్గొన్నారు.

8 కిలోల గంజాయి పట్టివేత

» నలుగురు నిందితుల అరెస్టు

ఘట్‌కేసర్ రూరల్, జూలై 22(ఆంధ్రజ్యోతి): గంజాయి తరలిస్తున్న నలుగురు నిందితులను పోచారం ఐటీ కారిడార్ పోలీసులు అరెస్టు చేసి 8 కిలోల గంజాయిని, వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. గుట్టుచప్పుడు కాకుండా గంజాయి రవాణా చేస్తున్న విషయం తెలుసుకున్న పోచారం ఐటీ కారిడార్ పోలీసులు సోమవారం రాత్రి అన్నోజి గూడ వద్ద వాహనాలు తనిఖీ చేపట్టారు. ఈ క్రమంలో రెండు బైక్‌లను తనిఖీ చేయగా 8కిలోల ఎండు గంజాయిని పట్టుకున్నారు. నిందితులను అదుపులోకి విచారించగా మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లా, కాప్రాకు చెందిన మకపాశ చంద్రశేఖర్(21), బడ్డిపుడి అభిరామ్(21), షేక్ సోహెల్ (20)లుగా తేలింది. కొత్తగూడెం జిల్లా, రామవరం నుంచి చల్లురి రవికాంత్ వద్ద నుంచి తక్కువ ధరకు గంజాయి కొనుగోలు చేసి కాప్రా పరిసర ప్రాంతాల్లో ఎక్కువ ధరకు విక్రయిస్తున్నట్లు తెలిపారు. కాగా, రవికాంత్‌ను మంగళవారం ఉదయం అరెస్టు చేశారు. వారి నుంచి రెండు బైకులు, 8 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకునున్నారు. కేసు నమోదు చేసి నిందితులను రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు.

హామీలను అమలు చేస్తున్నాం

» ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి



బషీరాబాద్‌లో ప్రొసీడింగ్‌ను అందజేస్తున్న ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి

బషీరాబాద్/యాలాల, జూలై 22(ఆంధ్రజ్యోతి): గత బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో ఒక్క రేషన్‌కార్డు ఇవ్వలేదని తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి విమర్శించారు. తాము అధికారంలోకి వస్తే అర్హులందరికీ రేషన్‌కార్డు ఇస్తామని చెప్పామని, ఆ హామీ మేరకు అర్హులకు కార్డులు ఇస్తున్నామని అన్నారు. మంగళవారం బషీరాబాద్‌లోని రైతు వేదికలో 558 మందికి రేషన్‌కార్డులను ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మట్లాడుతూ.. రేషన్‌కార్డుల కోసం పేదలు ఏళ్ల తరబడి ఎదురుచూసినా గత బీఆర్ఎస్ పాలకులు పట్టించుకోలేదన్నారు. అందరూ సన్నబువ్వ తినాలనే ఉద్దేశంతో సీఎం రేవంత్‌రెడ్డి సన్నబియ్యం ఇస్తున్నారని చెప్పారు. గ్యారంటీల అమల్లో భాగంగా త్వరలోనే కొత్తగా ఫించన్లు, పేద మహిళలకు రూ.2,500, భూమిలేని నిరుపేదలకు నెలకు రూ.వెయ్యి వంటి పథకాలను అమలు చేస్తామన్నారు. తాను ఎమ్మెల్యే అయిన తర్వాత మండలాన్ని రూ.400 కోట్ల నిధులతో అభివృద్ధి చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ షాహీదాబేగం, ఎంపీడీవో తిరుమలస్వామి, ఏఎంసీ, సొసైటీ చైర్మన్లు జి.మాధవరెడ్డి, ఎ.వెంకట్‌రాంరెడ్డి, వైస్ చైర్మన్లు అజయ్‌ప్రసాద్, చందర్‌నాయక్, మాజీ జెడ్పీటీసీ ఎం.శ్రీనివాస్‌రెడ్డి, మాజీ వైస్‌ఎంపీపీ ఎస్.వెంకటేష్, నాయకులు రామునాయక్, కలాల్ నర్సింహులు, శాంతి, అట్కారి సతీష్, రాజవర్ధన్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి, శంకర్‌రెడ్డి, బి.శ్రీనివాస్‌రెడ్డి, శ్రావణ్‌కుమార్, మాణిక్‌రావు, శ్రీహరి, నరేష్‌చౌహాన్ పాల్గొన్నారు. యాలాల రైతు వేదికలో రేషన్‌కార్డులను, కల్యాణలక్ష్మి చెక్కులను ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి పంపిణీ చేశారు. రేవంత్‌రెడ్డి గత ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలన్నీ అమలు చేస్తామని చెప్పారు. రేషన్ కార్డుల జారీ నిరంతరం ప్రక్రియ అని తెలిపారు. మండలంలో అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తామన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ వెంకటస్వామి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు నర్సిరెడ్డి, ప్యాక్స్ చైర్మన్ సురేందర్‌రెడ్డి, ఏఎంసీ చైర్మన్ బాల్‌రెడ్డి, నాయకులు అక్బర్‌బాబ, సత్యనారాయణ, రఘుమారెడ్డి, హన్మంతు పాల్గొన్నారు.



ఫరూఖ్‌నగర్ ఉన్నత పాఠశాలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

ఖద్దర్ వేసుకుంది కలెక్షన్లకు కాదు

సామాజిక సేవకు ప్రజలిచ్చిన అవకాశం.. షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

షాద్‌నగర్ అర్బన్, జూలై 22 (ఆంధ్రజ్యోతి): ప్రజలు ఓట్లు వేసి, ఖద్దర్ బట్టలు వేసుకునే అవకాశం ఇచ్చింది కలెక్షన్ల కోసం కాదని, సామాజిక బాధ్యతతో ప్రజా సేవ చేయడానికని షాద్‌నగర్ ఎమ్మెల్యే, ప్రభుత్వ రంగ సంస్థల చైర్మన్ వీర్లపల్లి శంకర్ అన్నారు. షాద్‌నగర్‌లోని ఒకటో వార్డులో మంగళవారం రూ.కోటీ 62 లక్షల వ్యయంతో నిర్మించే సీసీ రోడ్డు, అండర్ గ్రౌండ్ డ్రైనేజ్ నిర్మాణ పనులను ప్రారంభించారు. అనంతరం ఫరూఖ్‌నగర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను సందర్శించి అదనపు గదుల నిర్మాణ పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గత బీఆర్ఎస్ ప్రభుత్వం పదేళ్లలో విద్యను విధ్వంసం చేసిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ విద్యకు అధిక ప్రాధాన్యం ఇస్తుందన్నారు. ఫరూఖ్‌నగర్ ఉన్నత పాఠశాలకు రూ.65 లక్షలతో అదనపు గదుల నిర్మాణం, స్వచ్ఛంద సంస్థ సహకారంతో మరమ్మతులు చేయిస్తున్నామని తెలిపారు. పూర్వ విద్యార్థులు సైతం పాఠశాల అభివృద్ధి సహకారం అందించాలని కోరారు. కార్యక్రమంలో షాద్‌నగర్ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ బాబర్‌ఖాన్, మున్సిపల్ కమిషనర్ సునితారెడ్డి, ఎంఈవో మనోహర్, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు శైలజ, గ్రంథాలయ కమిటీ చైర్మన్ మధన్‌మోహన్‌రెడ్డి, నాయకులు అగ్గనూరి విశ్వం, బాల్‌రాజ్‌గౌడ్, చెన్నయ్య, చెంది తిరుపతి రెడ్డి, రఘునాయక్, జమ్రుద్‌ఖాన్, ఇబ్రహీం, శ్రీకాంత్‌రెడ్డి, పురుషోత్తంరెడ్డి, దంగు శ్రీనివాస్ యాదవ్, అశోక్, మసూద్‌ఖాన్ పాల్గొన్నారు.



నియామకపత్రం అందుకుంటున్న డాక్టర్ దొంతు శ్రీకాంత్

హోమియోపతి వైద్యాధికారిగా శ్రీకాంత్

ఆమనగల్లు, జూలై 22(ఆంధ్రజ్యోతి): ఆమనగల్లు హోమిపతి వైద్యాధికారిగా డాక్టర్ దొంతు శ్రీకాంత్ నియమితులయ్యారు. ఈ మేరకు మంగళవారం అడిషనల్ డైరెక్టర్ లింగరాజు నియామక ఉత్తర్వులను అందజేశారు. వైద్యారోగ్య శాఖలో ఆర్‌బీఎస్‌కేగా గత కొన్ని సంవత్సరాలుగా శ్రీకాంత్ ఆమనగల్లు, మాడ్గుల మండలాల్లో విధులు నిర్వహిస్తున్నారు. రెగ్యులర్ కావడంతో శ్రీకాంత్‌కు ఆమనగల్లు మండలంలో పోస్టింగ్ ఇచ్చారు.

వేదాద్రి గుట్టపై రేపు లక్ష్మీసుదర్శన యాగం

తలకొండపల్లి, జూలై 22(ఆంధ్రజ్యోతి): వెల్జాల శ్రీ వేదాద్రి గుట్టపై లక్ష్మీ నరసింహస్వామి ఆలయంలో రేపు(గురువారం) శ్రీ లక్ష్మీ సుదర్శన నారసింహస్వామి యాగం నిర్వహిస్తున్నారు. ఈమేరకు ఆలయం వద్ద నిర్వాహకులు పెద్దఎత్తున ఏర్పాట్లు చేస్తున్నారు.

ఏటా మహిళా సంఘాలకు రూ.20 వేల కోట్ల రుణాలు

(ఐదో పేజీ తరువాయి)



స్టాల్స్‌ను పరిశీలిస్తున్న మంత్రి శ్రీధర్‌బాబు, ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

రద్దీ కారణంగా మహిళలు ఇబ్బందులు పడుతుంటే కొందరు మూర్ఖులు మహిళల మధ్యన గొడవలు పెడుతున్నారంటూ వ్యాఖ్యలు చేయడం దారుణమన్నారు. వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లోనూ తమను ఆశీర్వదించాలని కోరారు. మహిళల కళ్లలో ఆనందం చూసేందుకే వడ్డీలేని రుణాలు అందిస్తున్నామని పేర్కొన్నారు. నియోజకవర్గ అభివృద్ధికి ఎమ్మెల్యే శంకర్ పట్టువదలని విక్రమార్కుడిలా కృషి చేస్తున్నారని, ఒక్క మాటలో చెప్పాలంటే ఆయన నిరంతర కృషీవలుడని కొనియాడారు. నియోజకవర్గంలో 3,500 ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయించుకున్నారని తెలిపారు. వచ్చే ఏడాది మరో 3500 ఇళ్లు ఇచ్చేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. అర్హులైన వారందరికీ రేషన్ కార్డులు ఇప్పించారని పేర్కొన్నారు. నియోజవర్గ అభివృద్ధికి ఎన్ని నిధులైన ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నామని తెలిపారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ సులోచన, మాజీ ఎమ్మెల్యేలు చౌలపల్లి ప్రతాప్ రెడ్డి, బీష్వ కిష్టయ్య, ఏఎంసీ వైస్ చైర్మన్ బాబర్ ఖాన్, శ్యాంసుందర్ రెడ్డి, తాండ్ర విశాలశ్రవణ్ రెడ్డి, వెంకట్రామ్‌రెడ్డి, తిరుపతిరెడ్డి, యాదయ్య యాదవ్, రఘునాయక్ తదితరులు పాల్గొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన కొన్ని నెలల్లోనే పేదలకు సన్నబియ్యం అందించి కడుపు నింపుతుందని తెలిపారు.

అద్దె ఆగం!

(ఐదో పేజీ తరువాయి)

బట్టి రూ.20 వేల నుంచి 30 వేలు అద్దె వసూలు చేస్తున్నట్లు సమాచారం. ఎస్సీ సర్వీస్ కోఆపరేటివ్ డెవలప్‌మెంట్ సొసైటీ లిమిటెడ్ షెట్టర్లకు ప్రస్తుతం డిమాండ్ ఉంది. అయితే పాత అద్దె అగ్రిమెంట్‌ను రద్దు చేసి ఒక్కో షట్టర్‌కు రూ.5 వేల నుంచి రూ.10వేల వరకు పెంచాలని జిల్లా ప్రజలు కోరుతున్నారు. గతంలో నిర్మించిన షాపింగ్ కాంప్లెక్స్‌లోని దుకాణ సముదాయాలు మరమ్మతులకు నోచుకోవడం లేదు. 25 షెట్లర్లు శిథిలావస్థకు చేరుకొని నిరుపయోగంగా మారాయి. వీటి మరమ్మతులకు రూ.30 లక్షల వరకు ఖర్చు వస్తుందని ఎస్సీ కార్పొరేషన్ అధికారులు అంచనా వేస్తున్నారు. కిస్మత్‌పూర్, శంషాబాద్, మహేశ్వరం, యాచారం, మంచాల, సాహేబ్‌నగర్, చేవెళ్ల, షాబాద్, శంకర్‌పల్లి, గచ్చిబౌలి ప్రాంతాల్లో దుకాణ సముదాయాలు మరమ్మతులు చేపట్టాల్సి ఉంది. నాగోల్ సర్వే నంబర్ 8ఏ/1లో 250 గజాల్లో నిర్మించిన ఐదు షెట్టర్లను ఎల్బీనగర్ జీహెచ్ఎంసీ ఎస్సీ కార్పొరేషన్ అధికారులకు సమాచారం ఇవ్వకుండానే కూల్చివేసినట్లు తెలిసింది. ఈ స్థలంలో పార్కు నిర్మించినట్లు సమాచారం.

నిరుపయోగంగా పౌల్ట్రీ షెడ్లు

ఎస్సీ సర్వీస్ కోఆపరేటివ్ డెవలప్‌మెంట్ సొసైటీ లిమిటెడ్ గతంలో జిల్లా వ్యాప్తంగా 43 ఎకరాల్లో 13 పౌల్ట్రీ ఫారాలను నిర్మించగా వీటిలో 395 షెడ్లను ఏర్పాటు చేసింది. ఒక్కో ప్రాంతంలో ఒక్కో విధంగా 3 నుంచి 6 ఎకరాల్లో పౌల్ట్రీ షెడ్లను నిర్మించింది. చేవెళ్ల మండలం గొల్లపల్లి, ఆలూరు, మొయినాబాద్ మండలం సురంగల్, పెద్దమంగళారం, అజీజ్‌నగర్, షాబాద్ మండలంలో ఎంపీడీవో కార్యాలయ సమీపంలో వీటిని నిర్మించారు. శేరిలింగంపల్లి పరిధిలోని గచ్చిబౌలి, ఖాజాగూడ, రాజేంద్రనగర్ మండలం ఖైలార్‌దేవ్‌పల్లి, నెక్నాపూర్, నార్సింగి, సాతంరాయి ప్రాంతాల్లో పౌల్ట్రీ షెడ్లను ఏర్పాటు చేశారు. వీటిలో అప్పట్లో ఎస్సీ సామజికవర్గానికి చెందిన రైతులు కోళ్ల పెంపకం చేపట్టారు. ఆ తరువాత నష్టాలు రావడంతో రైతులు ఈ వ్యాపారాన్ని వదిలేశారు. దాంతో ప్రస్తుతం ఆ షెడ్లు నిరుపయోగంగా మారాయి. మరి కొన్నిచోట్ల షెడ్లు కూలిపోయాయి. లబ్ధిదారులు నివాస అవసరాలకు ఉపయోగిస్తున్నారు. కోట్ల రూపాయల విలువ గల భూములు కబ్జాకు గురవుతున్నాయి. కొన్ని చోట్ల రెవెన్యూశాఖ అధికారులు వాటిని స్వాధీనం చేసుకున్నారు.

క్రైం కార్నర్

అదృశ్యమైన వ్యక్తి మృతదేహం లభ్యం

- జూన్ 13న అదృశ్యం.. కేసు నమోదు
- ఆమనగల్లు మండల పరిధి పెద్దగుట్టపై ఆత్మహత్య!



అంజయ్య (ఫైల్)

ఆమనగల్లు, జూలై 22(ఆంధ్రజ్యోతి): అదృశ్యమైన వ్యక్తి విగత జీవిగా మారిన ఘటన ఆమనగల్లు పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. కుళ్లిపోయి ఎముకల గూడుగా మారిన మృతదేహాన్ని పోలీసులు మృతుడి కుటుంబ సభ్యులకు అప్పగించారు. ఎస్సై వెంకటేశ్ తెలిపిన వివరాల మేరకు.. ఆమనగల్లు మున్సిపాలిటీ జంగారెడ్డిపల్లికి చెందిన కంబాలపల్లి అంజయ్య(57) జూన్ 13న ఇంటి నుంచి బయటకు వెళ్లిపోయి తిరిగి రాలేదు. బంధువులు, వ్యవసాయ పొలం, తెలిసినవారి వద్ద ఆరా తీసినా ఆచూకీ లభించలేదు. అంజయ్య కుమారుడు కంబాలపల్లి అల్లాజీ ఆమనగల్లు పోలీస్‌స్టేషన్‌లో అదేరోజు ఫిర్యాదు చేశాడు. పోలీసులు మిస్సింగ్ కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టారు. సోమవారం సాయంత్రం జంగారెడ్డిపల్లి పెద్ద గుట్టపై చెట్టుకు ఉరేసుసుకొని ఓ వ్యక్తి మృతదేహం వేలాడుతుండడం చూసిన గొర్రెల కాపరులు గ్రామస్థులకు, సమీప పొలాల రైతులకు సమాచారం అందించారు. దాంతో అంజయ్య కుటుంబ సభ్యులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. కుళ్లిపోయి అస్థిపంజరంగా మారిన మృతదేహంపై ఉన్న బట్టల ఆధారంగా ఆత్మహత్యకు పాల్పడ్డ వ్యక్తి జంగారెడ్డిపల్లికి చెందిన అదృశ్యమైన కంబాలపల్లి అంజయ్యగా గుర్తించారు. ఈమేరకు సోమవారం రాత్రి ఎస్సైప్పు వెంకటేశ్ పోలీసు సిబ్బందితో పెద్దగుట్టకు చేరుకొని మృతదేహాన్ని పరిశీలించారు. మంగళవారం కల్వకుర్తి ప్రభుత్వ ఆసుపత్రి వైద్యులు సంఘటన స్థలంలో అంజయ్య మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించారు. అనంతరం కుటుంబ సభ్యులకు అంజయ్య మృతదేహాన్ని అందజేశారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఇద్దరు బైక్ దొంగల అరెస్టు



నిందితులు దాసరి శ్రీకాంత్, శివ

ఆమనగల్లు, జూలై 22(ఆంధ్రజ్యోతి): బైక్ చోరీలకు పాల్పడ్డ ఇద్దరు వ్యక్తులను మంగళవారం పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. ఎస్సై వెంకటేశ్ తెలిపిన వివరాల మేరకు.. మాడ్గుల మండలం నాగిళ్ల గ్రామానికి చెందిన చాట్ల శివ జూన్ 21న తన బైక్‌ను ఆమనగల్లు బస్టాండ్‌లో పార్క్ చేసి పని నిమిత్తం వెళ్లాడు. తిరిగి వచ్చి చూడగా బైక్ కన్పించకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని పోలీసులు దర్యాప్తు చేపట్టారు. సీసీ కెమెరాల ఆధారంగా ఫరూఖ్‌నగర్ మండలం కొండన్నగూడ గ్రామానికి చెందిన దాసరి శ్రీకాంత్, దాసరి శివలు బైక్‌ను చోరీ చేసినట్లు గుర్తించారు. ఇద్దరినీ అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించి బైక్‌ను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై వెంకటేశ్ తెలిపారు. ఈమేరకు చోరీ కేసును ఛేదించిన క్రైమ్ డిపార్ట్‌మెంట్ కానిస్టేబుళ్లు రఘునాయక్, శివకుమార్‌లను ఎస్సై అభినందించారు.

ఆంజనేయస్వామి ఆలయంలో చోరీ

యాచారం, జూలై 22(ఆంధ్రజ్యోతి): మండల మండలంలోని పాతమాల్ గ్రామంలో సోమవారం అర్ధరాత్రి గుర్తుతెలియని దుండగులు ఆలయంలో స్వామివారి వెండి కన్నులతో పాటు ఇతర ఆభరణాలు చోరీ చేశారని గ్రామస్థులు తెలిపారు. అయితే, స్థానికులే చోరీ చేసి ఉంటారని గ్రామస్తులు అనుమానం వ్యక్తం చేశారు. కాగా, ఈ విషయంపై పోలీసులను ఆరా తీయగా ఎలాంటి ఫిర్యాదు అందలేదని చెప్పారు.

ఈత చెట్లు, సమాధులు ధ్వంసం

- పోలీసులకు గౌడ సంఘం నాయకుల ఫిర్యాదు

షాద్‌నగర్ రూరల్, జూలై19(ఆంధ్రజ్యోతి): ఫరూఖ్‌నగర్ మండలం దూసకల్ గ్రామ శివారులో గీత కార్మికులు పెంచుకున్న ఈత చెట్లు, దశాబ్దాల నుంచి ఉన్న సమాధులను ధ్వంసం చేశారని గౌడ సంఘం నాయకులు మంగళవారం పోలీసులకు, ఎక్సైజ్ అధికారులతో పాటు ఇరిగేషన్ అధికారులకు ఫిర్యాదు చేశారు. గ్రామ శివారులోని సర్వే నంబర్ 81లోని 8 గుంటల భూమిలో దశాబ్దాల నుంచి గౌడ కులస్థుల సమాధులు ఉన్నాయని తెలిపారు. ఆ స్థలంలోనే ఈత చెట్లు పెంచినట్లు చెప్పారు. అయితే, ఈనెల 16న గ్రామానికి చెందిన ఓ మాజీ ప్రజాప్రతినిధి జేసీబీతో ఈత చెట్లు, సమాధులు, చెరువు కాలువను ధ్వంసం చేశారని, ఇదేంటని అడిగితే అది తన పట్టా భూమి అంటూ బెదిరింపులకు గురిచేస్తున్నారని పేర్కొన్నారు. ఈ విషయమై పోలీసులను వివరణ కోరగా విచారణ చేస్తున్నామని తెలిపారు. ఫిర్యాదు చేసినవారిలో రామస్వామి గౌడ్, యాదయ్య గౌడ్, కుమార్‌గౌడ్, బాలయ్య గౌడ్ తదితరులు ఉన్నారు.

పోగొట్టుకున్న సెల్‌ఫోన్ల రికవరీ

- బాధితులకు అప్పగించిన పోలీసులు

యాచారం, జూలై 22(ఆంధ్రజ్యోతి): సెల్‌ఫోన్లను చాలా జాగ్రత్తగా వాడాలని, విద్యార్థులకు ఇవ్వరాదని హైదరాబాద్ గ్రీన్‌ఫార్మాసిటీ సీఐ లిక్కి కృష్ణంరాజు చెప్పారు. చోరీకి గురైన దర్గయ్య, రమేష్, నీలంశ్రీనుల సెల్‌ఫోన్‌లను రికవరీ చేసి మంగళవారం వారికి అందించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ సెల్‌ఫోన్‌లు తీసుకున్న సమయంలో ఈఎంఐ నెంబర్లను భద్రపరచుకోవాలన్నారు. చోరీకి గురైన వెంటనే తమకు ఈఎంఐ నెంబర్ల తెలిపి ఫిర్యాదు చేస్తే రికవరీ చేస్తామన్నారు.

'హైటెన్షన్ విద్యుత్ లైన్' బాధితులకు రెట్టింపు పరిహారం ఇవ్వాలి



ఆర్డీవో జగదీశ్వర్‌రెడ్డికి వినతిపత్రం ఇస్తున్న జీఎల్ఎన్ రెడ్డి, రామకృష్ణ, అనిల్

కడ్తాల్, జూలై 22(ఆంధ్రజ్యోతి): కడ్తాల గ్రామాన్ని అనుసరించి వేస్తున్న 765 కేవీ విద్యుత్ లైన్ ఏర్పాటు మూలంగా భూములు కోల్పోయిన రైతులకు పరిహారం రెట్టింపు చేసి ఇవ్వాలని రాష్ట్ర సర్పంచ్‌ల సంఘం మాజీ అధ్యక్షుడు గూడూరు లక్ష్మీనర్సింహారెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈమేరకు మంగళవారం బీఆర్ఎస్ గ్రామ కమిటీ అధ్యక్షుడు కడారి రామకృష్ణ, అన్మాస్‌పల్లి మాజీ ఉప సర్పంచ్ అనిల్ కుమార్ యాదవ్‌తో కందుకూరు ఆర్డీవో జగదీశ్వర్‌రెడ్డిని కలిసి వినతి పత్రం అందజేశారు. కడ్తాల మండలంలోని పలు గ్రామాల మీదుగా బీదర్ నుంచి మహేశ్వరం వరకు నూతనంగా నిర్మిస్తున్న 765 కేవీ విద్యుత్ లైన్ మూలంగా రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని పేర్కొన్నారు. హైటెన్షన్ విద్యుత్ టవర్లు, లైన్ల ఏర్పాటుతో వ్యవసాయ భూముల వినియోగాన్ని ప్రభావితం చేస్తుందని, పంట ఉత్పత్తులు కూడా దెబ్బతింటాయని వినతి పత్రంలో పేర్కొన్నారు. కడ్తాల మండల కేంద్రాన్ని అనుసరించి బహిరంగ మార్కెట్‌లో గజం ధర రూ.20-25 వేలు పలుకుతుందన్నారు. ఈనేపథ్యంలో బహిరంగ మార్కెట్‌కు అనుగుణంగా భూములు కోల్పోయిన రైతులకు ప్రభుత్వం ద్వారా తగిన పరిహారం అందేలా చూడాలని వినతిపత్రంలో కోరారు. లేనియెడల బాధిత రైతులతో కలిసి ఆందోళన కార్యక్రమాలు చేపడుతామని లక్ష్మీనర్సింహారెడ్డి అన్నారు. రైతులకు అన్యాయం జరుగకుండా ప్రజాప్రతినిధులు చొరవ తీసుకోవాలని ఈ సందర్భంగా ఆయన కోరారు.

వైభవంగా ఆషాఢ బోనాలు



చేవెళ్ల : అంతారంలో బోనాలు ఊరేగింపు

చేవెళ్ల/యాచారం, జూలై 22 (ఆంధ్రజ్యోతి) : చేవెళ్ల మండల పరిధిలోని అంతారం, ఇబ్రహీంపల్లి తదితర గ్రామాల్లో మంగళవారం బోనాల వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఆషాఢ మాసం బోనాల సందర్భంగా గ్రామస్తులు అమ్మవారికి నైవేద్యం సమర్పించారు. బోనాల ఊరేగింపు సందర్భంగా శివసత్తుల పూనకాలు, డప్పు చప్పుళ్లతో గ్రామం మార్మోగింది. ప్రజాప్రతినిధులు, గ్రామస్తులు ఉన్నారు. అలాగే యాచారం మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులు బోనాల ఉత్సవాలు ఘనంగా జరుపుకున్నారు. బాలికలు బోనం తయారుచేసి పాటలు పాడుతూ ఊరేగారు. కళాశాల వద్ద గ్రామ దేవతకు నైవేద్యం సమర్పించి టెంకాయలు కొట్టి మొక్కులు చెల్లించుకున్నారు. ప్రిన్సిపాల్ శ్రీనివాస్ మాట్లాడుతూ నిరంతరం చదువులకే పరిమితం కాకుండా రాష్ట్ర చరిత్రను తెలిపేలా ఇలాంటి కార్యక్రమా లు నిర్వహించడం చాలా సంతోషంగా ఉందన్నారు. లెక్చరర్లు విద్యార్థులు పాల్గొన్నారు.



యాచారం : బోనాల వేడుకలో టీచర్లు, విద్యార్థులు

ధర్నాకు తరలిన ఉద్యమకారులు



గన్‌పార్కు వద్ద ధర్నాలో జిల్లాకు చెందిన ఉద్యమకారులు

రంగారెడ్డి అర్బన్, జూలై 22 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ ఉద్యమకారులు మంగళవారం గన్‌పార్కు వద్ద నిర్వహించిన ధర్నా కార్యక్రమానికి జిల్లా నుంచి పెద్ద సంఖ్యలో ఉద్యమకారులు తరలివెళ్లారు. ఉద్యమకారులకు రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలని డిమాండ్ చేశారు. గుర్తింపు కార్డులు, సంక్షేమ పథకాల్లో 20 శాతం కోటా కేటాయించాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా ఉద్యమకారుల ప్రత్యేకంగా సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలని ఈ సందర్భంగా అన్నారు. ధర్నా కా ర్యక్రమంలో తెలంగాణ ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ చీమ శ్రీనివాస్, జిల్లా అధ్యక్షుడు కొంతం యాదిరెడ్డి, చేవెళ్ల పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జి యాలాల మహేశ్వర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అచ్యుతానందన్ ఆశయాలను కొనసాగిద్దాం



షాద్‌నగర్ అర్బన్ : అచ్యుతానందన్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు రాజు



ఇబ్రహీంపట్నం : అచ్యుతానందన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న సీపీఎం నాయకులు

షాద్‌నగర్ అర్బన్/చేవెళ్ల/ఇబ్రహీంపట్నం/మంచాల, జూలై 22 (ఆంధ్రజ్యోతి): కేరళ మాజీ ముఖ్యమంత్రి దివంగత వీఎస్ అచ్యుతానందన్ ఆశయాలను కొనసాగించడానికి సీపీఎం కార్యకర్తలు కృషి చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు రాజు పిలుపునిచ్చారు. షాద్‌నగర్ సీఐటీయూ ఆఫీసులో మంగళవారం అచ్యుతానందన్ చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. శ్రీనునాయక్, బేరి శ్రీనివాస్, మహమ్మద్‌బాబు, కావలి రాజు, వడ్ల చంద్రమౌళి, వెంకటరమణ, అంజనేయులుగౌడ్, బలరాంగౌడ్, నర్సింహగౌడ్, శ్రీకాంత్, శంకర్, ఆరిఫ్ తదితరులున్నారు. అచ్యుతానందన్ సేవలు చిరస్మరణీయమని సీపీఎం చేవెళ్ల డివిజన్ కార్యదర్శి అల్లి దేవేందర్ తెలిపారు. చేవెళ్ల పట్టణ కేంద్రంలో ఆయన చిత్రపటానికి సీపీఎం నాయకులు నివాళులర్పించారు. చేవెళ్ల మండలాధ్యక్షులు కిష్టయ్య, నాయకులు శ్రీనివాస్, అరుణ్‌కుమార్, రాములు, దస్తగిరి, ఎట్టయ్య, భారతమ్మ తదితరులు ఉన్నారు. అచ్యుతానందన్ ఆశయాలను ముందుకు తీసుకుపోతామని సీపీఎం ఇబ్రహీంపట్నం మండల కార్యదర్శి సీహెచ్ బుగ్గరాములు అన్నారు. ఇబ్రహీంపట్నంలో ఆయన చిత్రపటానికి సీపీఎం నాయకులు పూలమాలలువేసి నివాళులర్పించారు. నాయకులు సీహెచ్ జంగయ్య, పి.జగన్, నర్సింహ, ప్రభుదాసు, గణేష్, కృష్ణ, యాదగిరి తదితరులున్నారు. అచ్యుతానందన్ మృతిపట్ల మంచాల సీపీఎం నేతలు సంతాపం వ్యక్తం చేశారు. మంచాలలో ఆయన చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. సీపీఎం మండల కార్యదర్శి రావుల జంగయ్య, పి.గోపాల్, ఆవుల యాదయ్య, కాళ్ల జంగయ్య, అన్నారం లెనిన్, అశోక్, వినోద్, బక్కతట్ల అయిలయ్య, గడ్డం బాల్‌రాజ్, గ్యారగాలయ్య, బాల్‌రాజ్ సత్తయ్య, చరణ్ తదితరులున్నారు.

ఎంపీ మల్లును కలిసిన కాంగ్రెస్ నాయకులు



ఆమనగల్లు, జూలై 22(ఆంధ్రజ్యోతి): నాగర్‌కర్నూల్ ఎంపీ డాక్టర్ మల్లు రవిని మంగళవారం కాంగ్రెస్ జిల్లా నాయకుడు మండ్లీ రాములు, ఆమనగల్లు మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ గుర్రం కేశవులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఢిల్లీలోని ఆయన నివాసంలో కలిసి పూలమాలలు, శాలువాలతో సత్కరించారు. ఆమనగల్లు మున్సిపాలిటీ, మండల అభివృద్ధికి ప్రభుత్వపరంగా తోడ్పాటునందించాలని కోరారు. స్థానిక ఎన్నికల్లో పార్టీ విజయమే లక్ష్యంగా ముందుకు సాగాలని మల్లు రవి సూచించినట్లు రాములు, కేశవులు పేర్కొన్నారు.

వేతన బకాయిలు చెల్లించాలి



ఎంపీడీవోకు వినతి పత్రం ఇస్తున్న ఫీల్డ్ అసిస్టెంట్లు

షాబాద్, జూలై 22(ఆంధ్రజ్యోతి): ఫీల్డ్ అసిస్టెంట్లకు నాలుగు నెలల వేతన బకాయిలను వెంటనే చెల్లించాలని ఫీల్డ్ అసిస్టెంట్ల సంఘం మండలాధ్యక్షుడు అంజయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈమేరకు షాబాద్ మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం ఎంపీడీవో అపర్ణకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత నాలుగు నెలలుగా వేతనాలు పెండింగ్‌లో ఉన్నాయని, ప్రభుత్వం వెంటనే చెల్లించాలన్నారు. ఎంపీడీవో కార్యాలయంలో జరిగే వీక్లీ మీటింగ్‌ను బహిష్కరిస్తున్నట్లు ఈ సందర్భంగా ఆయన తెలిపారు. కార్యక్రమంలో ఎంపీవో శ్రీనివాస్, ఏపీవో వీరాసింగ్, ఫీల్డ్ అసిసెంట్లు పాల్గొన్నారు.

బాలింతలకు కేసీఆర్ కిట్లు అందజేత

ఆదిభట్ల, జూలై 22(ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ ప్రభుత్వంలో ప్రవేశపెట్టిన కేసీఆర్ కిట్లతో శిశు మరణాలు గణనీయంగా తగ్గాయని, కాంగ్రెస్ ప్రభుత్వంలో కేసీఆర్ పథకం లేకపోవడంతో బాలింతలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని కప్పపహాడ్ మాజీ ఎంపీటీసీ ఏనుగు భరత్‌రెడ్డి అన్నారు. ఈ నెల 24న కేటీఆర్ పుట్టినరోజు పురస్కరించుకొని ఇబ్రహీంపట్నం మండల పరిధిలోని తుర్కగూడలో నలుగురు బాలింతలకు కేసీఆర్ కిట్లు పంపిణీ చేశారు. ఆయనతో పాటు విక్రత్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

కేటీఆర్‌ను కలిసిన విజితారెడ్డి

ఆమనగల్లు, జూలై 22(ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ రాష్ట్ర నాయకురాలు, మాజీ జడ్పీటీసీ డాక్టర్ ద్యాప విజితారెడ్డి మంగళవారం బీఆర్ఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను తెలంగాణ భవన్‌లో మర్యాద పూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలిపారు. ప్రజాసమస్యలపై నిరంతరం ప్రజల పక్షాన పోరాటం చేయాలని, ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టాలని కేటీఆర్ సూచించినట్లు విజితారెడ్డి తెలిపారు.

బాధిత కుటుంబానికి ఎమ్మెల్యే పరామర్శ

తలకొండపల్లి, జూలై 22(ఆంధ్రజ్యోతి): ఆమనగల్లు మున్సిపాలిటీ విఠాయిపల్లి వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన గట్టిప్పలపల్లికి చెందిన ఏదుల అశోక్ కుటుంబాన్ని మంగళవారం ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి పరామర్శించారు. అశోక్ మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. బాధిత కుటుంబానికి రూ.5వేల ఆర్థికసాయం అందజేశారు. ప్రభుత్వ పరంగా బాధిత కుటుంబానికి తగిన సాయమందేలా చూస్తానని తెలిపారు. పరామర్శించిన వారిలో టీపీసీసీ అధికార ప్రతినిధి బాలాజీసింగ్, మాజీ వైస్ ఎంపీపీ శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు డేవిడ్, రేణురెడ్డి, శివకుమార్ గౌడ్,రాజశేఖర్, నరేందర్‌గౌడ్, హరికిషన్ రెడ్డి, అంజయ్య, శ్రీను, మశ్చందర్, మల్లయ్య, రాహుల్, పరమేశ్, శంకర్, తదితరులున్నారు. అలాగే బాధిత కుటుంబాన్ని ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ సభ్యులు, నాయకులు పరామర్శించి మాజీ జడ్పీటీసీ ఉప్పల వెంకటేశ్ సమకూర్చిన రూ.3వేలు అందజేశారు. నాయకులు జ్యోతయ్య, అశోక్, వెంకటయ్య, అంజనేయులు, శరత్ చంద్ర, చంద్రశేఖర్‌రెడ్డి, డేవిడ్, రేణురెడ్డి, సాయిబాబా, రాజు, తదితరులున్నారు.



మృతదేహం వద్ద నివాళి అర్పిస్తున్న ఎమ్మెల్యే నారాయణరెడ్డి

బాధితుడికి రూ.20 వేలు ఆర్థిక సాయం

తలకొండపల్లి, జూలై 22(ఆంధ్రజ్యోతి): దేవునిపడకల్ గ్రామానికి చెందిన రావిచెడ్ జంగయ్య అనారోగ్యానికి గురై హైదరాబాద్‌లోని నిమ్స్‌లో చికిత్స పొందుతున్నాడు. విషయం తెలుసుకున్న మాజీ సర్పంచ్ కాడేమోని శ్రీశైలం మంగళవారం జంగయ్యను పరామర్శించారు. కాంగ్రెస్ జిల్లా నాయకుడు కాసు శ్రీనివాస్‌రెడ్డి రూ.10వేలు, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు ప్రభాకర్‌రెడ్డి రూ.5 వేలు, కాడేమోని శ్రీశైలం రూ. 5వేలు ఇచ్చారు.

రవీందర్ రెడ్డికి మాజీ జడ్పీటీసీ పరామర్శ

కేశంపేట, జూలై 22(ఆంధ్రజ్యోతి): ఫరూఖ్‌నగర్ మండలం చిలకమర్రిలో ఇటీవల బోనాల సందర్భంగా హత్యాయత్నానికి గురైన కాంగ్రెస్ నాయకుడు చిలకమర్రి రవీందర్‌రెడ్డిని మంగళవారం కేశంపేట మాజీ జడ్పీటీసీ తాండ్ర విశాలశ్రవణ్‌రెడ్డి దంపతులు పరామర్శించారు. షాద్‌నగర్ పట్టణంలోని ఆయన నివాసానికి వెళ్లి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు.



మహిళా శక్తి సంబురాలకు తరలిన మహిళలు

కేశంపేట, జూలై 22(ఆంధ్రజ్యోతి): షాద్‌నగర్ పట్టణంలో మంగళవారం నిర్వహించిన ఇందిర మహిళా శక్తి సంబురాలకు కేశంపేట మండల మహిళా సమాఖ్య, మహిళా సంఘాల సభ్యులు తరలివెళ్లారు. మండల మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో మండలంలోని అన్ని గ్రామాల నుంచి మహిళా సంఘాల సభ్యులు మహిళా శక్తి సంబురాలకు తరలించారు. మంత్రి శ్రీధర్ బాబు, ఎమ్మెల్యే శంకర్ చేతులమీదుగా మహిళా సంఘాలకు వడ్డీలేని రుణాలు అందించారని తెలిపారు. మహిళా సమాఖ్య అధ్యక్షురాలు భాగమ్మ, ఏపీఎం భగవంతు, మండల మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు గుండె రాణి, సీసీ రామచంద్రయ్య, ఆయా గ్రామాల మహిళా సంఘాల అధ్యక్ష, కార్యదర్శులు, సభ్యులు ఉన్నారు.


సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేత

ఆమనగల్లు, జూలై 22(ఆంధ్రజ్యోతి): చింతపల్లికి చెందిన గుమ్మళ్ల సందీప్ రెడ్డికి మంజూరైన రూ.60వేల సీఎంఆర్ఎఫ్ చెక్కును ఆమనగల్లు ఏఎంసీ డైరెక్టర్ తాళ్ల రవీందర్ మంగళవారం అందజేశారు. స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ మండల కమిటీలు

షాబాద్/మంచాల, జూలై 22(ఆంధ్రజ్యోతి): బీజేపీ షాబాద్ మండల నూతన కమిటీని నియమించినట్లు బీజేపీ జిల్లా అధ్యక్షుడు పతంగి రాజ్‌భూపాల్‌గౌడ్ తెలిపారు. ఈ సందర్భంగా మంగళవారం మీడియాతో మాట్లాడుతూ మండల వైస్‌ప్రెసిడెంట్లుగా బాలమణి, ఉపేందర్‌రెడ్డి, నరేందర్‌రెడ్డి, శేఖర్, ప్రధాన కార్యదర్శులుగా హరీష్, రాజీవ్‌రెడ్డి, కార్యదర్శులుగా మమత, శేఖర్, యాదీష్, అనిత, ట్రెజరర్‌గా నారాయణ, సభ్యులుగా వెంకటేష్‌గౌడ్, అశోక్, రవి, అనిల్, శేఖర్, అలివేలు, భాస్కర్‌రెడ్డి, శివకృష్ణ, శ్రీశైలంలను ఎన్నుకున్నట్లు తెలిపారు. బీజేపీ మంచాల మండల కమిటీ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నట్లు మండలాధ్యక్షుడు నూకం రాజు పేర్కొన్నారు. ప్రధాన కార్యదర్శులుగా వెదిరె జగదీశ్వర్ రెడ్డి, కారింగ్ రాజుగౌడ్, ఉపాధ్యక్షులుగా యాట రమేష్, నర్ల కృష్ణయాదవ్, పొలగోని రాజేశ్వరి, దేవరనాయక్, కోషాధికారిగా గంట నర్సింహారెడ్డిలు ఎన్నికయ్యారు.

కేశంపేట మండల కన్వీనర్‌గా మహేశ్



కేశంపేట, జూలై 22(ఆంధ్రజ్యోతి): బీజేపీ కేశంపేట మండల కన్వీనర్‌గా పోమాల్‌పల్లికి చెందిన కంచుకోట మహేశ్‌ను జిల్లా కార్యవర్గం నియమించింది. మంగళవారం జిల్లా అధ్యక్షుడు రాజగోపాల్ గౌడ్ ఉత్తర్వులు జారీ చేశారు. తనకు సహకరించిన బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పాలమూరు విష్ణువర్ధన్ రెడ్డి, అందె బాబయ్య, శ్రీవర్ధన్ రెడ్డి, మండలాధ్యక్షురాలు రాధికకు మహేశ్ కృతజ్ఞతలు తెలిపారు.

ఘనంగా దాశరథి జయంతి



ఇబ్రహీంపట్నం : మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ రాధిక

ఇబ్రహీంపట్నం/శంకర్‌పల్లి, జూలై 22 (ఆంధ్రజ్యోతి): దాశరథి తన కవిత్వం ద్వారా ఎంతో మందిని ప్రభావితం చేస్తూ యువతను చైతన్య మార్గంలో నడిపించారని ఇబ్రహీంపట్నం ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డా.ఎస్.రాధిక అన్నారు. దాశరథి కృష్ణమాచార్య శతజయంతి ఉత్సవాల సందర్భంగా మంగళవారం కళాశాలలో దాశరథి కవితా సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో కళాశాల తెలుగు శాఖ అధ్యక్షుడు డా.కె.సురేష్ తదితరులు పాల్గొన్నారు. ప్రముఖ సాహిత్యవేత్త, అభ్యుదయవాది, తెలంగాణ బావుటాను తన సాహిత్యంతో ప్రపంచ పటాన రెపరెపలాడించిన ఘనుడు దాశరథి అని శంకర్‌పల్లి మండలం కొండకల్ ప్రభుత్వ పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు జీవనజ్యోతి తెలిపారు. దాశరథి జయంతి వేడుకలను పాఠశాలలో ఘనంగా నిర్వహించారు. టీచర్ మల్లేశం, విద్యార్థులు పాల్గొన్నారు.



శంకర్‌పల్లి : దాశరథి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు